ఈనాడు
అమరావతి
గుంటూరు
శనివారం మే 10, 2025

సకాలంలో ఛార్జిషీట్లు దాఖలు చేయండి

సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

గుంటూరులీగల్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ శుక్రవారం జిల్లా కోర్టులోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణచక్రవర్తి ఛాంబర్‌లో సమావేశమైంది. గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు, ఒకటో అదనపు జిల్లా జడ్జి వి.ఎ.ఎల్.సత్యవతితోపాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి సాయికల్యాణచక్రవర్తి మాట్లాడుతూ గుంటూరు నగరంలో న్యాయమూర్తులకు నివాసగృహాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, సత్తెనపల్లి, పొన్నూరు, నరసరావుపేట, గురజాలలో న్యాయస్థాన భవనాల నిర్మాణం నిమిత్తం స్థల సేకరణ చర్యలు చేపట్టాలని సూచించారు. పలు కేసుల్లో పోలీసులు ఛార్జిషీట్లు సకాలంలో దాఖలు చేయడం లేదని, జైళ్లలో మగ్గుతున్న ఖైదీల కేసుల దర్యాప్తును సత్వరం పూర్తి చేయాలని, పోక్సో కేసుల్లో కూడా సత్వర దర్యాప్తు చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఎస్పీలకు సూచించారు. పెండింగ్ కేసులు, పోలీసు దర్యాప్తు, భవనాల మరమ్మతుల గురించి సమీక్షించారు.

లంక భూముల సమస్యపై చర్యలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరులోని ప్రాంతీయ సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ రాజధాని రైతులు, రైతు కూలీల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. రాజధాని గ్రామాల పరిధిలోని లంక భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరగా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా లంక భూముల అంశంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఆర్డీఏ పోర్టల్‌లోని జీఐఎస్ మ్యాప్‌లో సాంకేతిక సమస్యలున్నాయని రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు ఫిర్యాదు చేశారు. భూవ్యవహారాలపై 22, సామాజిక సంక్షేమం-1 చొప్పున మొత్తం 23 అర్జీలు వచ్చాయి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.రవీందర్, ఎం.శేషిరెడ్డి, కె.ఎస్ భాగ్యరేఖ, పి.పద్మావతి, జి.భీమారావు, జీ.ఆర్.ఎం నోడల్ అధికారి పి.జయశ్రీ పాల్గొన్నారు.

లైసెన్సుల నవీకరణ ఎప్పుడు?

మార్చి 31తో గడువు ముగిసినా లావాదేవీలు
బిల్లులు అనుమతిస్తున్న మిర్చియార్డు యంత్రాంగం

ఈనాడు - అమరావతి

గుంటూరు మిర్చియార్డులో గడువు ముగిసిన లైసెన్సుల పునరుద్ధరణ వ్యవహారం ఇంతవరకూ తేలలేదు. వీటిని ఐదేళ్లకోసారి నవీకరణ చేయించాల్సి ఉంది. 120 సంస్థలకు 2025 మార్చి 31తో గడువు ముగిసినా నేటికీ నవీకరించలేదు. వ్యాపారులు ముందుగానే మార్కెటింగ్‌శాఖ అధికారులకు దరఖాస్తు చేసినా అంతులేని జాప్యం జరుగుతోంది. మరోవైపు గడువు ముగిసిన లైసెన్సుల పేరుతోనే వ్యాపారాలు నిర్వహిస్తూ రైతులకు బిల్లులు ఇస్తున్నారు. వీటిని కట్టడి చేయాల్సిన యంత్రాంగం అనుమతించడం గమనార్హం. వ్యాపారులు రైతులకు డబ్బు సకాలంలో చెల్లించని పక్షంలో వారి లైసెన్సు హోల్డ్‌లో పెట్టే అవకాశం కూడా లేకుండాపోయింది.

త్రీమెన్ కమిటీ ఆమోదించినా.....

లైసెన్సుల నవీకరణ విషయంలో గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని విజిలెన్స్ విభాగం విచారణలో గుర్తించి నివేదికలో ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో యార్డు కార్యదర్శి, మార్కెటింగ్‌శాఖ ఏడీ, జేడీతో త్రీమెన్ కమిటీ వేసి నవీకరణకు వచ్చిన 120 సంస్థల లైసెన్సులను పరిశీలించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ కమిటీ వాటిని పరిశీలించి అందులో 35 లైసెన్సులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని వాటిని పునరుద్ధరించాలని డైరెక్టర్‌కు జాబితాను పంపింది. రోజులు గడుస్తున్నా వాటికి ఆమోదం రాలేదు.

85 లైసెన్సులపై సందిగ్ధం

త్రీమెన్ కమిటీ 85 లైసెన్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తిరస్కరించింది. భాగస్వామ్య ఒప్పందాల్లో మార్పులు ఉండటం, ఒకరి స్థానంలో మరొకరి పేరు నమోదు చేయడం వంటివి గుర్తించింది. వీటిని సదరు వ్యాపారులకు పంపి నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని సూచిస్తారా? లేదా? అన్నదానిపై స్పష్టత రాలేదు. దీనివల్ల సదరు వ్యాపారుల కార్యకలాపాలను కట్టడి చేయలేదన్న చర్చ జరుగుతోంది. ఏటా రూ.వేల కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగే మిర్చియార్డులో ఎప్పటికప్పుడు సమీక్షించుకుని లోపాలను సరిదిద్దాల్సి ఉండగా. . అందుకు విరుద్ధంగా కార్యకలాపాలు జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

కళాశాల నుంచి కార్పొరేట్ సంస్థలోకి..

నైపుణ్య పెంపు, ఉపాధి లక్ష్యంగా ఏఎన్‌యూలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్న సంస్థలు

న్యూస్‌టుడే - ఏఎన్‌యూ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు దక్కేలా అధికారులు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇందుకోసం వివిధ సంస్థలు ఏఎన్‌యూలో తమ కార్యాలయాలు నెలకొల్పనున్నాయి. ఇప్పటికే డస్సాల్ట్ 3డీ ల్యాబ్, డ్రోన్, ఇంక్యుబేషన్ కేంద్రాలు తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటికి అదనంగా స్టేట్ స్ట్రీట్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ సంస్థలు త్వరలోనే రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ సంయుక్తంగా విద్యార్థులకు మొదటి విడత శిక్షణ ఇచ్చాయి. దీనికి ఆ సంస్థ అధికారిణి అక్వీందర్‌కౌర్ హాజరయ్యారు. మైక్రోసాఫ్ట్ కోపైలట్, గిట్ హబ్, జెన్ ఏఐపై శిక్షణ తీసుకున్న 1,200 మందికి త్వరలోనే ధ్రువీకరణపత్రాలు అందజేయనున్నారు. మెషిన్‌లెర్నింగ్, పైథాన్, కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్‌లతో పాటు అధునాతన సాంకేతిక కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. మరికొన్ని కోర్సులు ఎంవోయూ దశలో ఉన్నాయి. ఈ కేంద్రాలను ఏఎన్‌యూలోని దూరవిద్యా కేంద్రంలో ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధ్యాపకులు చెబుతున్నారు. ఇప్పటికే భవనాలను సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాణిప్రసాద్, ఇతర అధికారులు పరిశీలించారు. ఏ సంస్థకు ఎంత స్థలం కావాలన్నదానిపై ఏఎన్‌యూ అధికారులతో చర్చించారు.

ఇటీవల ఏఎన్‌యూలోని దూరవిద్యాకేంద్రంలో నైపుణ్య కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీప్రసాద్

విద్యార్థులకు మేలు

ఈ కేంద్రాలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ కార్యకలాపాలు, శిక్షణ ప్రారంభించనున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు అదనంగా వీటిని నేర్చుకోవచ్చు. దీనివల్ల నూతన సాంకేతిక అంశాలపై పట్టు చిక్కుతుంది. ఆయా అంశాల్లో సామర్థ్యం పెరుగుతుంది. ప్రధానంగా ఇంజినీరింగ్ మూడు, నాలుగో సంవత్సర విద్యార్థులకు వివిధ పరిశ్రమలకు అవసరమైన అంశాలు, నైపుణ్యాల్లో శిక్షణ ఉచితంగానే ఇస్తారు. ఉద్యోగం రాగానే మళ్లీ శిక్షణ అవసరం లేకుండా నేరుగా విధుల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతారు. ఏఎన్‌యూలో అన్నీ నెలకొల్పాక ఇతర జిల్లాల్లోని కళాశాలలకు ఈ కేంద్రాలను విస్తరించనున్నారు. కనెక్ట్ నాలెడ్జ్ సెంటరు త్వరలోనే డాటా సైన్స్ విద్యార్థులకు నూతన అంశాల్లో శిక్షణ ఇవ్వనుంది.

నారా లోకేశ్ ఆలోచనలతోనే

రాష్ట్రంలోని విద్యార్థులకు అవసరమైన అంశాల్లో నైపుణ్య శిక్షణ, పరిశ్రమ ఆధారిత కోర్సులు నిర్వహించేందుకు వివిధ సంస్థలు ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే ఏఎన్‌యూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కళాశాల నుంచి కార్పొరేట్ సంస్థలోకి అనే నినాదంతో ఏఎన్‌యూ ముందుకెళ్తోంది.

అటు నుంచి మొదలెడదాం

తొలుత శివారు ఆయకట్టుకు నీరు
వృథాను అరికట్టేందుకు యంత్రాంగం ఆలోచన

ఈనాడు - అమరావతి

నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ కింద సాగు నీటి వృథాను అరికట్టి మరింత సమర్థంగా ఉపయోగించుకోవడానికి జలవనరులశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన ప్రాజెక్టుల పరిధిలో ఆయా కాలువలకు కేటాయించిన నీటి కంటే అదనంగా వాడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎన్నెస్పీ కాలువల కింద కేటాయించిన నీటి కంటే కొన్నేళ్లుగా ఎక్కువగా వాడుతున్నారు. రెండు పంటల సాగు వల్ల నీటి వినియోగం పెరుగుతోంది. ఈ క్రమంలో కేటాయింపులకు తగ్గట్టుగా నీటిని పొదుపుగా వాడుకుంటూ పంటలు పండించుకునేలా అధికారులు ప్రణాళికను తయారు చేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి కాలువల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. నీటి పొదుపునకు ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నారు.

కాలువ చివరి పంటలు సాగు చేసేలా..

ఉమ్మడి జిల్లాలో సాగర్ కుడికాలువ కింద 7 లక్షల ఎకరాలు, కృష్ణా పశ్చిమడెల్టా పరిధిలో 5 లక్షల ఎకరాలకు సాగునీరిస్తున్నారు. లక్షలాది ప్రజల తాగునీటి అవసరాలకు కాలువలే ఆధారం. అటు సాగు, ఇటు తాగు అవసరాలకు నీటిని విడుదల చేస్తూనే వృథాకు అడ్డుకట్ట వేయాలన్నది అధికారుల ప్రయత్నం. ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ప్రకారం.. నీటిని విడుదల చేయగానే కాలువకు మొదట్లో ఉన్న రైతులు పంట సాగు చేస్తున్నారు. శివారున ఉన్న రైతులు చివర్లో పంటలు వేస్తున్నారు. ప్రధాన కాలువలు వంద కిలోమీటర్లకుపైగా పొడవు ఉండడంతో తొలి భాగంలో పంట సాగుకు.. శివారు పంట సాగుకు మధ్య 40 నుంచి 60 రోజుల వ్యత్యాసం ఉంటోంది. దీనికితోడు కాలువ మొదటి భాగంలో తొలి పంట పూర్తి కాగానే రైతులు రెండో పంట వేస్తున్నారు. శివారు ఉన్న పొలాలకు నీరివ్వాల్సి ఉన్నందున కాలువ మొదట్లో రెండో పంట వేసుకున్నవారికి అడ్డుకట్ట వేయలేని పరిస్థితి. దీనివల్ల సాగునీరు వృథా అవుతోందని జలవనరులశాఖ గుర్తించింది. దీనికి అడ్డుకట్ట వేయడానికి కాలువ శివారు ఆయకట్టులో తొలుత సాగు ప్రారంభించి తొలిభాగంలో చివరలో సాగు చేసేలా ప్రణాళికలు రూపకల్పనలు చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కాలువ శివారులో పంట పూర్తయిన వెంటనే ఆయా కాలువలకు నీటి విడుదల ఆపేస్తారు. దీంతో రైతులు రెండో పంట వేసుకునే వెసులుబాటు ఉండదు. చివరి నుంచి కాలువ ప్రారంభం వరకు అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తూ వస్తారు. దీనివల్ల వృథాకు అడ్డుకట్ట పడటంతోపాటు అవసరం మేరకు విడుదల చేయవచ్చని జలవనరులశాఖ భావిస్తోంది. క్షేత్రస్థాయి సమాచారంతో ప్రతిపాదనలు సిద్ధం చేశాక ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కాలువ శివారు ప్రాంతాల రైతులు ఆలస్యంగా పంటలు సాగు చేయడానికి అలవాటు పడ్డారు. డెల్టాలో తుపాన్ల ప్రభావానికి అనుగుణంగా సాగు ప్రణాళిక ఉంటుంది. వీటన్నిటిని పరిగణనలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలు పరిశీలించి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని జలవనరులశాఖ ఇంజినీరు ఒకరు తెలిపారు.

పోలీసు యంత్రాంగం అప్రమత్తం

రైల్వేస్టేషన్, లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

డార్మెటరీలోని వ్యక్తి వేలిముద్రలు పరిశీలిస్తున్న పోలీసులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : యుద్ధ వాతావరణం నేపథ్యంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా జిల్లాలో ఏవైనా సంఘవిద్రోహ శక్తులు ఉన్నాయా అని కనిపెట్టేందుకు పోలీసులు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వేకువజాము వరకు పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లతోపాటు లాడ్జిలు, డార్మెటరీలు, శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యాప్ ద్వారా అనుమానితుల వేలిముద్రలు పరిశీలించారు. లాడ్జిల్లో ఉన్నవారి వివరాలు, రికార్డులు పరిశీలించి పలువురి గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల బ్యాగ్‌లు తనిఖీ చేశారు. అర్ధరాత్రి రహదారులపై తిరుగుతున్న వాహన చోదకులను ఆపి విచారించారు. రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సైతం నగరంలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐజీ, ఎస్పీలు హెచ్చరించారు.

వెంటాడే కళ్లు

- జిల్లావ్యాప్తంగా 4,428 కెమెరాల ఏర్పాటు
- నేరగాళ్లను పట్టిస్తున్న నిఘా నేత్రాలు

☛ **లక్ష్మీపురంలో** గుర్తు తెలియని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి ఓ మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకెళ్లిన కేసులో ఓ ఇంటి వద్ద ఉన్న నిఘా నేత్రం ఆధారంగా వారిని పోలీసులు గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు.

☛ **కొత్తపేటలోని** ఓ ఇంట్లో రూ. కోటి విలువైన బంగారం, వెండి ఆభరణాల దోపిడీ కేసులో తొలుత ఆధారాలు లభించలేదు. సమీపంలోని ఓ నిఘా నేత్రం ద్వారా పోలీసులు అతడి ఆనవాలు గుర్తించి లోతుగా దర్యాప్తు చేయగా.. ఆ దొంగ రెండు తెలుగు రాష్ట్రాల్లోనే సుమారు వందకుపైగా దొంగతనాలు చేసినట్టుగా తేలడంతో పట్టుకుని ఆభరణాలు జప్తు చేశారు.

ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన నిఘా నేత్రం

న్యూస్‌టుడే - నెహ్రూనగర్ (గుంటూరు)

నేరమేదైనా... నిందితులను పట్టించడంలో నిఘా నేత్రాలు కీలకంగా మారాయి. అనేక సంచలన కేసుల ఛేదనలో దర్యాప్తునకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. గుంటూరువారితోటలోని ఓ ఇంట్లో వృద్ధురాలిని రాడ్డుతో కొట్టి చంపేసిన వైనంలో నిందితుడు ఎవరో గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారినప్పుడు చుట్టుపక్కల నిఘా కెమెరాల్లోని దృశ్యాలు అక్కరకొచ్చాయి. తెనాలికి చెందిన వ్యక్తి గంజాయి మైకంలో వృద్ధురాలిని హత్య చేసి బంగారు ఆభరణాలు అపహరించినట్టు తేలింది. అరండల్‌పేటలోని ఓ వ్యక్తిని దుండగులు కత్తులతో దాడి చేసి కిరాతకంగా హత్య చేసిన ఘటన సమీపంలోని ఓ హోటల్ వద్ద ఉన్న నిఘా నేత్రంలో రికార్డు కావడంతో 12 మంది నిందితులను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు.

నేర పరిశోధనలో కీలకంగా మారిన నిఘా కెమెరాలను జిల్లా వ్యాప్తంగా అమర్చుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రధాన కూడళ్లు, హోటళ్లు, సినిమా థియేటర్లు, షాపింగ్‌మాల్స్, బహుళ అంతస్తుల భవనాలు... ఇలా అన్ని చోట్లా ఉండేలా ఎస్పీ సతీష్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. ఫలితంగా జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 4,428 కెమెరాలను అమర్చారు. వీటిలో కొన్నింటిని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తున్నారు.

పోలీస్ సబ్‌డివిజన్ వారీగా కెమెరాల సంఖ్య

గుంటూరు	
తూర్పు	- 740
పశ్చిమ	- 547
ఉత్తరం	- 960
దక్షిణం	- 562
తుళ్లూరు	- 550
తెనాలి	- 1,019
ట్రాఫిక్ స్టేషన్ల పరిధిలో	- 50

నేరాల కట్టడికి వీలుగా: ఎస్పీ సతీష్‌కుమార్

నేరగాళ్లను గుర్తించడానికి నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇవి ఉన్నాయంటే.. దొరికిపోతామన్న భయంతో నేరం చేయడానికి వెనుకాడతారు. జిల్లావ్యాప్తంగా 5 వేల నిఘా నేత్రాలను ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 4,428 కెమెరాలు పెట్టించాం. మిగిలినవి త్వరగా ఏర్పాటు చేయిస్తాం.

నాణ్యత పేరుతో పొగబెడుతున్నారు

- వర్జీనియా పొగాకు ధరలో కోత
- సగటున కిలో రూ.264.29
- 25 శాతం బేళ్లు తిరస్కరిస్తుండడంతో రైతుల్లో కలవరం

ఈనాడు - అమరావతి

వర్జీనియా పొగాకు కొనుగోళ్లలో నాణ్యత పేరుతో 20 నుంచి 25 శాతం వరకు సరకు తిరస్కరిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత సీజన్‌తో పోల్చితే ఈ సీజన్ ప్రారంభంలో ధరలు బాగున్నాయి. గతేడాది పొగాకు ధర క్రమంగా పెరుగుతూ ఆఖరుకు వచ్చేసరికి రికార్డు స్థాయిలో కిలో రూ. 400 పైగా లభించింది. ఈసారీ అదే స్థాయిలో ధరలుంటాయన్న అంచనాతో రైతులు బోర్డు నిర్దేశించిన దాని కంటే అదనంగా పండించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్, విదేశాల్లో ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకుని వ్యాపారులు పొగాకు కొంటున్నారు. బ్రెజిల్, జింబాబ్వేల్లో ఈసారి పంట బాగా ఉంది. చైనాలో ఏటా 2 వేల మిలియన్లు పండిస్తుండగా ఈసారి 1900 మిలియన్లలోపే ఉంది. అక్కడి నుంచి ఏటా 200 నుంచి 300 మిలియన్లు ఎగుమతి చేస్తుండగా ఈసారి 100 మిలియన్లకు పరిమితమవుతుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. వీటన్నింటి దృష్ట్యా మన దేశంలో ఉత్పత్తి పెరిగినా ధరలు తగ్గకుండా అమ్ముకునే పరిస్థితి ఉంది. కానీ నాణ్యత పేరుతో వ్యాపారులు ధరలు కోసేస్తున్నారు.

లక్ష్యానికి మించి..

రాష్ట్రంలో 2024-25 సీజన్‌లో 167 మిలియన్ కిలోల పొగాకు పండించడానికి బోర్డు అనుమతిచ్చింది. రైతులు ఈసారి అదనంగా సాగు చేయడంతో 240 మిలియన్ కిలోల వరకు ఉత్పత్తి అవుతుందని అంచనా. కర్ణాటకకు 100 మిలియన్ కిలోల లక్ష్యం నిర్దేశించగా 85 మిలియన్లకే పరిమితమైంది. ఏపీలో ఉత్పత్తి పెరిగినా అంతర్జాతీయ మార్కెట్‌లో వర్జీనియా పొగాకుకు కొంత డిమాండ్ ఉండటంతో ధరలు తగ్గకుండా కొనసాగుతున్నాయి.

గిట్టుబాటు కాదంటున్న సాగుదారులు

వర్జీనియా పొగాకు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో సాగు చేస్తారు. కర్ణాటకలో తొలుత పంట చేతికి రావడంతో అమ్మకాలూ పూర్తయ్యాయి. అక్కడ 84.86 మిలియన్ కిలోలు కొనుగోలు చేయగా ప్రారంభంలో కిలో సగటు ధర రూ.257.62 లభించింది. ఏపీలో నెలన్నర నుంచి వేలం కొనసాగుతోంది. కిలో సగటు ధర రూ. 264.29గా నమోదయింది. గతేడాది సీజన్ ప్రారంభంలో కిలో రూ. 220కు కొనుగోలు చేయగా ఈసారి కిలో రూ.280తో ప్రారంభమైంది. గతేడాది ధరలను దృష్టిలో ఉంచుకుని బ్యారన్ల అద్దెలు, భూముల కౌలు, ఇతర ఖర్చులు పెరగడంతో ఉత్పత్తి వ్యయం పెరిగిందని.. కిలో రూ. 280కు విక్రయిస్తేనే గిట్టుబాటవుతుందని సాగుదారులు చెబుతున్నారు. నాణ్యత కలిగిన పొగాకుకు ధర బాగానే ఉన్నా.. నాణ్యత లేదని తిరస్కరించే సరకు పరిమాణం పెరుగుతుండటం రైతులను కలవరపెడుతోంది. గతేడాది డిమాండ్ దృష్ట్యా నాణ్యత ఎంత తగ్గినా కొనుగోలు చేశారని, ఈసారి వివిధ కారణాలు చూపి తిరస్కరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

జేసీకి ఇన్‌ఛార్జి కలెక్టర్ బాధ్యతలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈ నెల 12వ తేదీ నుంచి ముస్సోరిలో శిక్షణకు వెళ్లనున్న నేపథ్యంలో ఆ బాధ్యతలను జేసీకి అప్పగించాలని సూచిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శిక్షణ అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి వచ్చేవరకు జేసీ భార్గవ్ తేజ.. ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా కొనసాగనున్నారు.

జనరల్ బోగి @ 3 స్టార్

జనరల్ బోగీలో డైనింగ్, సోఫాలు

త్రీస్టార్ వసతులతో అత్యాధునికంగా తయారైన రైల్వేశాఖకు చెందిన జనరల్ బోగీలివి. కీలకమైన ట్రాక్ పరిరక్షణ బృందాల కోసం వీటిని దేశంలోనే మొదటిసారిగా గుంటూరులో తయారు చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలోని అన్ని డివిజన్లకు ఈ క్యాంపింగ్ కోచ్‌లను తయారు చేసే శాటిలైట్ ట్రాక్ మిషన్ షెడ్‌ను గుంటూరులోని నల్లపాడులో ఏర్పాటు చేశారు. వీటిని ట్రాక్ బృందంలో ఉండే సీనియర్ సెక్షన్ ఇంజినీర్, సీనియర్ టెక్నీషియన్, టెక్నీషియన్, కలాసీలకు కేటాయిస్తారు. గతంలో వీరికి జనరల్ బోగీలు కేటాయించేవారు. కీలకమైన సిబ్బంది కావడంతో మెరుగైన సౌకర్యాలు ఉండేలా జనరల్ బోగీలను ఇక్కడకు తీసుకొచ్చి అందులో సోఫాలు, డైనింగ్ హాలు, ఏసీతో కూడి పడక గదులు, వంట, స్నానపు గదులు.. ఇలా అన్ని వసతులతో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా రైల్వే ట్రాక్‌లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే ప్రత్యేక ఇంజిన్‌తో ఈ కోచ్‌లలో సిబ్బందిని తరలించి మరమ్మతులు చేయిస్తారు. ఈ క్యాంపింగ్ కోచ్‌లను దక్షిణ మధ్య రైల్వేలోని అన్ని డివిజన్లకు పంపుతున్నామని, ఇప్పటికి 22 ఆధునిక కోచ్‌లను తయారు చేశామని సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కృష్ణ తెలిపారు.

- ఈనాడు, గుంటూరు

ఏసీతో పడక వసతి

వైకాపా నేత వేధింపులతో కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

పొన్నూరు, న్యూస్‌టుడే: వైకాపా నేత వేధింపులు తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని వడ్డిముక్కల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తన్నీరు నాగేశ్వరరావు కొంత పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. అతను తన వ్యవసాయ అవసరాలకు 2023వ సంవత్సరంలో నిడుబ్రోలుకు చెందిన వైకాపా నేత, సొసైటీ మాజీ అధ్యక్షుడు నన్నపనేని వీరయ్య చౌదరి వద్ద రూ.1.70 లక్షలు అప్పుగా తీసుకున్నారు. రూ.70 వేలు తిరిగి జమ చేశారు. మిగిలిన అప్పు ఈ ఏడాది మార్చి నెలలో చెల్లిస్తానని ఒప్పందం చేసుకున్నట్టు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సందర్భంలో కౌలురైతు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ మొత్తం చెల్లించ లేకపోవడంతో వీరయ్యచౌదరి అతని ఇంటికి వెళ్లి అసభ్యంగా దూషించి ట్రాక్టరు, ట్రక్కును బలవంతంగా తీసుకు వెళ్లినట్టు కౌలు రైతు చెబుతున్నారు. దీనిపై ఇటీవల పొన్నూరు గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై కిరణ్‌బాబు తెలిపారు. అయినా తనకు న్యాయం జరక్కపోవడంతో మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు గ్రామ శివారులో శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు గమనించి 108 వాహనంలో పొన్నూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మినీ మేళాల్లో 1,536 ఉద్యోగాలు కల్పించాం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే రామాంజనేయులు, డాక్టర్ పెరుమాళ్లు

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: జిల్లాలో గతేడాది జూన్ నుంచి మార్చి వరకు 120 కంపెనీలతో 30 మినీ ఉద్యోగమేళాలు నిర్వహించి 1,536 మందికి ఉద్యోగాలు కల్పించామని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాను ఆమె ప్రారంభించారు. 48 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారని, ఇందుకు పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కీలకపాత్ర వహించారని తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ డిగ్రీ, పీజీలు చదివాక ఖాళీగా ఉండొద్దని, అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఒకే చోటకు పదుల సంఖ్యలో కంపెనీలు రావడం వల్ల అభ్యర్థులకు విలువైన సమయం ఆదా అవుతుందన్నారు.

465 మందికి కొలువులు.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి 2500 మంది అభ్యర్థులు హాజరుకాగా..465 మంది ఉద్యోగాలు సాధించారు. వీరికి ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు నియామక పత్రాలు అందించారు. కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు భోజన వసతి కల్పించగా.. రైతు డెయిరీ యజమాని కమ్మా నాగమల్లేశ్వరరావు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పీఎస్ విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయ్, సీఈవో పి.జ్యోతిబసు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి కె.సంజీవరావు పాల్గొన్నారు.

మరికొన్ని గ్రామాల్లో భూసమీకరణ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: రాజధాని అమరావతి కోసం అమరావతి మండలంలో మరికొన్ని గ్రామాల్లో కూడా భూసమీకరణ చేపట్టే అవకాశం ఉందని చెబుతున్నారు రెండో విడత భూసమీకరణలో భాగంగా జిల్లాలో ఏప్రిల్ 25న అమరావతి మండలం యండ్రాయి, వైకుంఠపురం, పెదమద్దూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. రైతులంతా భూములివ్వడానికి అంగీకారం తెలిపారు. ఈ నెల 7న కర్లపూడి, లేమల్లె గ్రామాల్లో కూడా గ్రామ సభలు నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ నాలుగు గ్రామాల్లోనే 9,600 ఎకరాలు సమీకరించనున్నారు. ఇప్పుడు అమరావతి, ధరణికోట, లింగాపురం, నరుకుళ్లపాడు, ఉంగుటూరు, నెమలికల్లు, మన్నెపూడి, పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, కంభంపాడు గ్రామాల్లో కూడా భూ సమీకరణ చేసే అవకాశాలున్నట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో ద్వితీయశ్రేణి నాయకులు రైతులతో చర్చలు జరుపుతున్నారని తెలిసింది. మొత్తంగా పల్నాడు జిల్లాలో రాజధానిని ఆనుకుని ఉన్న అమరావతి, పెదకూరపాడు మండల గ్రామాల్లో సుమారు 30వేల ఎకరాల భూమి ఉంది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా, అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేస్టేషన్ నిర్మాణం కోసం భూమి అవసరం ఉంది. రెండో విడత భూసమీకరణ జిల్లాలో చేపడుతున్నారు. రెండ్రోజుల కిందటే స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సీఎం చంద్రబాబును కలిసినప్పుడు భూసమీకరణ మిగతా గ్రామాల్లో కూడా చేపట్టాలని సూచించినట్లు తెలిసింది.

(c) eenadu

ఆగిన కల .. అడుగు పడితే కళ

క్రాఫ్ట్‌బజార్లో నిర్మాణాల దుస్థితి

బొమ్మలు చిందరవందరగా..

రాజధాని అమరావతిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గత తెదేపా ప్రభుత్వం శాఖమూరు వద్ద 300 ఎకరాల్లో సెంట్రల్ పార్కు నిర్మాణం తలపెట్టింది. ఇక్కడ రోజ్‌గార్డెన్, చిల్డ్రన్స్ ఎమ్యూజ్‌మెంట్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, 5, 3 స్టార్ ఎకో రిసార్ట్స్, స్పోర్ట్స్, బోటింగ్, వాటర్ స్పోర్ట్స్ తదితర సదుపాయాలు కల్పించాలని సంకల్పించింది. గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో అయిదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిర్మాణాలు, సామగ్రి శిథిలమవుతూ పొదల మధ్య పడి ఉన్నాయి. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన కృతులు, బొమ్మలు రంగులు పోయి కళతప్పాయి. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు మొదలైన నేపథ్యంలో ఈ పార్కును కూడా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **-ఈనాడు, అమరావతి**

వారధిపై ప్రమాదం లేదిక

స్పందనకు వందనం

నాడు.. వారధి అంచులు పోయి..

నేడు బాగు చేశాక...

ఎన్టీఆర్ - గుంటూరు జిల్లాల మధ్య కృష్ణా నదిపై నిర్మించిన వారధిపై బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో వంతెన అంచులు విరిగిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే వారధిపై వాటికి మరమ్మతులు చేయకుండా వదిలేశారని 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు స్పందించారు. పాడైన అంచులను తొలగించి కొత్తవి అమర్చారు. **- ఈనాడు, అమరావతి**

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ

మంగళగిరి, న్యూస్‌టుడే: దిల్లీలో గతనెల 30 నుంచి ఈనెల 5వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో అండర్-11 బాలికల విభాగంలో ఏపీ తరఫున ఎంపికైన మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన తమ్మయ్య నాగదుర్గ 1500 మీటర్ల రోడ్డురేస్, 500 మీటర్ల రింక్‌రేస్‌లో వెండి పతకాలు సాధించింది. నాగదుర్గ మంగళగిరి మండలం ఆత్మకూరు నిర్మల ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ పదోతరగతి చదువుతుంది. జాతీయస్థాయిలో విజేతగా నిలిచిన బాలికను యాజమాన్యం, కోచ్‌లు కాజ, సుధాకర్ అభినందించారు.

కొల్లిపరలో 68.4 మి.మీ వర్షపాతం

కలెక్టరేట్: జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు సగటున 7.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కొల్లిపర మండలంలో అత్యధికంగా 68.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. తెనాలి 42, తుళ్లూరు 5.4, పెదనందిపాడు 3.2, చేబ్రోలు 2.8, తాడికొండ 2.6, ఫిరంగిపురం 1.6, ప్రత్తిపాడు 1.2, మేడికొండూరు 0.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ACHARYA NAGARJUNA UNIVERSITY
NAGARJUNA NAGAR-522510., Guntur District, A.P.
No. ANU/Engg. Sec./various works/ 2025-26. Date: 09.05.2025
'e-procurement' Short Tender Notice
The Registrar, ANU is inviting sealed tenders through www.apeprocurement.gov.in from the eligible contractors/firms for the works of (1). Providing Impervious coat to East side of Arts Block-II in ANU campus, (2). Face lifting to Rabindranath Tagore Building (Administration Building) in ANU Campus with the financial assistance of RUSA (1.0).
Place: Nagarjuna Nagar REGISTRAR

ప్రభుత్వ బడులను పరిరక్షించాలి

కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా

మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాదరావు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణలు ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం జీవో 117తో 3, 4, 5 తరగతులను కిలోమీటరు దూరంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల బాట పట్టారన్నారు. 12 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఏర్పడి, వేలాది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులుగా తేలారన్నారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ ఆ జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, తర్వాత మంత్రిగా ఉత్తర్వులిచ్చినా యంత్రాంగం దానిని పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టి, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు సమాంతరంగా కొనసాగించాలన్నారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ఉన్నత పాఠశాలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు, పీఈటీ పోస్టులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మొండిగా వెళ్తే మే 14న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు కనీసం ఆరు స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులు ఇవ్వాలన్నారు. దివ్యాంగ ఉపాధ్యాయులకు కోర్టు కేసులతో సంబంధం లేకుండా కోరుకున్న చోట ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ కరవు భత్యాలు విడుదల చేయాలని కోరారు. ధర్నాలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీద్, నాయకులు ఎం.ఎన్.మూర్తి, ఎం.హనుమంతరావు, నాగశివన్నారాయణ, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల నిబంధనలు సవరించకపోతే ధర్నా

జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ బదిలీల నిబంధనలు సవరించకపోతే ఈ నెల 12న ధర్నా చేపట్టనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పేర్కొన్నారు. ఈమేరకు యూటీఎఫ్ చేపట్టనున్న ధర్నా నోటీసును నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలికి శుక్రవారం అందించారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేలా... ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా.. ఉపాధ్యాయుల బదిలీ నిబంధనలు ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు ఉండాలని, ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిష్పత్తి 1:20 ఉండాలని, హైస్కూళ్లలో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణ కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శులు ఎం.గోవిందు, కె.రంగారావు, ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు బాగైంది

స్పందనకు వందనం

వైకాపా ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతికి వెళ్లే ఉండవల్లి కరకట్ట దారి వేసిన ఏడాదికాకముందే అంచుల్లో కుంగిపోయింది. రోడ్డు చీలిపోయి దారి పొడవునా గుంతలు పడ్డాయి. 'గుంతల్లో పడితే అంతే' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు కుంగి, గుంతలు పడ్డచోట తారు పోసి బాగు చేశారు. **- ఈనాడు, అమరావతి**

సినీ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మపై కేసు

గుంటూరు నేరవార్తలు: సినీ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మపై శుక్రవారం గుంటూరు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .జాతిపిత మహాత్మాగాంధీ, దేశ తొలి ప్రధాని నెహ్రూపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన శ్రష్టి వర్మపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నజీర్‌బేగ్ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

వైకాపా ఎంపీటీసీ సభ్యురాలి అరెస్ట్

తాడికొండ, తుళ్లూరు, న్యూస్‌టుడే: చిన్నపిల్లల మధ్య నెలకొన్న వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. తాడికొండ మండలం కంతేరులో గత నెల 25న చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి నమోదైన కేసులో కంతేరు వైకాపా ఎంపీటీసీ సభ్యురాలు వలపర్ల కల్పనతో పాటు మరో నలుగురిని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ వాసు కథనం ప్రకారం..గ్రామానికి చెందిన జెట్టి రోహిణి దంపతుల కుమారుడు ఏదో తరగతి చదువుతున్నాడు. ఆటల్లో భాగంగా పిల్లల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గత నెల 25న గ్రామంలోని మరో వర్గానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు వలపర్ల కల్పన మరికొంత మంది గుంపులుగా కర్రలు, ఇనుప రాడ్లు తీసుకొని రోహిణి ఇంటికి వెళ్లి ఆమెతోపాటు కుటుంబ సభ్యులను కొట్టి గాయపరిచారు. చంపేస్తాం అని బెదిరించారు. రోహిణి వర్గీయులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. శుక్రవారం కల్పన, కర్రి మహాలక్ష్మి, కర్రి భాస్కర్, కర్రి నిఖిల్‌లను అరెస్ట్ చేశారు. గ్రామానికి చెందిన జెట్టి తిరుమలరావు, జెట్టి బ్రహ్మనాయుడు, మాడ గోపి, సుధా కోటయ్య, సాయి.. తమను కులం పేరుతో దూషించి దాడి చేశారని కల్పన వర్గీయులు ఫిర్యాదుపైనా కేసు నమోదైంది.

నిందితులకు రిమాండ్..: నిందితులను తాడికొండ పోలీసులు అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులైన కల్పన, మహాలక్ష్మి తమను తెల్లవారు జామున 3:30 గంటలకు అరెస్టు చేశారని, కనీసం దుస్తులు మార్చుకునే సమయం ఇవ్వకుండా బలవంతంగా అరెస్టు చేసినట్లు న్యాయవాది ద్వారా కోర్టుకు వివరించారు. దీంతో తాడికొండ పోలీసులకు కోర్టు మెమో జారీ చేసింది. కోర్టు బయట వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ మహిళలను సూర్యోదయం తర్వాతే అరెస్ట్ చేయాలన్న నిబంధనలు ఈ కేసులో ఉల్లంఘించారన్నారు. కూటమి నేతలను మెప్పించాలని పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

కౌలు రైతు బలవన్మరణం

అనంతవరప్పాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: అనంతవరప్పాడు గ్రామంలో అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. అనంతవరప్పాడు గ్రామానికి చెందిన వేజండ్ల ప్రకాశరావు(44) కౌలు పొలం సాగు చేస్తూ అప్పుల పాలయ్యారు. వరుసగా మూడేళ్లు మిరప పండకపోవడంతో అప్పులు రెట్టింపు అయ్యాయి. వీటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఈ నెల 8న కలుపు నివారణ మందు తాగారు. బంధువులు వెంటనే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు. మృతుని భార్య వేజండ్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తాం

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు సంక్షేమం అందిస్తూ, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రణాళికతో ముందడుగు వేస్తున్నట్లు తెనాలి శాసనసభ్యుడు, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.22.68 లక్షల చెక్కులను అందించారు. పట్టణ చినరావూరుకు చెందిన ఇబ్రహీంకు చెక్క బల్లరిక్షా అందించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డొంక రోడ్లు, వివిధ సంక్షేమ పథకాలతోపాటు తమ సమస్యలపై ప్రజలు అర్జీలను మనోహర్‌కు ఇచ్చారు. బిషప్ సుధీర్ కుమార్, పలువురు పాస్టర్లు మనోహర్‌ను కలిసి శ్మశానవాటిక స్థలం కేటాయింపుతోపాటు ఇతర అవసరాలను తెలిపారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	85,708
అమ్మకాలు:	96,112
నిల్వలు:	17,960

కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)

334	9500-13400
నెంబర్5	10000-12500
341	10000-13300
4884	10000-11200
సూపర్10	10000-12600
తాలు	5000- 6500

స్పెషల్ వెరైటీ

తేజ	10000-14000
బాడిగ	10000-12000
దేవనూరు డీలక్స్	10000-12500
ఆర్మూర్	9800-11200
తాలు	5000- 6500

-న్యూస్‌టుడే, మిర్చియార్డు

ఎమ్మెల్యే పీఏనని జీఎంసీ కమిషనర్‌కు బెదిరింపులు

కేసు నమోదు చేసిన నగరంపాలెం పోలీసులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పీఏనంటూ గుంటూరు నగరపాలకసంస్థ(జీఎంసీ) కమిషనర్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై శుక్రవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ సీసీ సెల్ నంబర్‌కు మార్చి 21న గుర్తుతెలియని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పీఏని మాట్లాడుతున్నానని చెప్పాడు. గుంటూరు సాయినగర్‌లో మీరు సరిగా పనిచేయడం లేదని, వీధి దీపాలు సరిగా వెలగడం లేదని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సరిగా రావడం లేదని.. మీ మీద పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. ఇలా గత ఏడాది నవంబర్ 27 నుంచి ఈ ఏడాది మార్చి 21 వరకు సుమారు 20 సార్లు ఫోన్ చేశాడు. జీఎంసీ ఏఈకి ఎమ్మెల్యే పీఏనని సుమారు 10 సార్లు ఫోన్ చేశాడు. నగరపాలకసంస్థ కమిషనర్ సెల్ నంబర్‌కు సుమారు ఐదు సార్లు ఫోన్ చేసి బెదిరించాడు. ఈవిషయాన్ని జీఎంసీ కమిషనర్ తనకు ఫోన్ చేసి తెలిపారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి వద్ద పీఏగా పనిచేస్తున్న పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన పంగులూరి పుల్లయ్య నగరంపాలెం పోలీసులకు తెలిపారు. తనకు, ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి పేరు, ప్రతిష్ఠలకు భంగం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు పుల్లయ్య ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నజీర్‌బేగ్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 127, రిటైల్ ధర - 149, చికెన్ విత్‌స్కిన్ - 216, చికెన్ స్కిన్‌లెస్ - 246.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -124 రిటైల్ ధర 146 చికెన్ విత్ స్కిన్ - 212, చికెన్ స్కిన్‌లెస్ - 241.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 500 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

న్యాయ పరిమితిపై సదస్సు నేడు

గుంటూరులీగల్: న్యాయ పరిమితిపై జిల్లాలోని న్యాయమూర్తులకు అవగాహన కల్పించేందుకు శనివారం సదస్సు నిర్వహించనున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో జరగనున్న సదస్సుకు జిల్లా ఇన్‌ఛార్జి జడ్జి జస్టిస్ నైనాల జయసూర్య, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఎ.వి.శేషసాయి, జస్టిస్ బి.శివశంకర్‌రావు పాల్గొంటారు. కార్యక్రమానికి జిల్లాలోని న్యాయమూర్తులందరూ హాజరుకానున్నారు.

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజ్ స్టైల్	సా. 5 - రా. 9
ఈ స్టార్ మీ స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 94757 50267.

EDUCATION

SPOKEN ENGLISH

ఇంగ్లీషు సులభంగా 60 గళ్ల ద్వారా మాట్లాడండి 7th నుండి డిగ్రీ విద్యార్థుల వరకు రేపటి నుండి 5 రోజులు ఫ్రీ క్లాసులకు హాజరుకండి. వాట్సప్ ద్వారా ప్రామాణిక GNT. 94405 39029.

PERSONAL CLASSIFIEDS

MISSING



కనబడుటలేదు
నిమ్మల పెద్దిరాములు
(70సం॥ వయస్సు)
అడ్రస్ : స్వర్ణభారతినగర్ 1వలైను, గుంటూరు. పై ఫోటోలోని వ్యక్తి ది.02-03-2025 ఆదివారం నుండి కనబడుటలేదు. తెల్లచొక్కా మరియు ఆకుపచ్చ లుంగీ ధరించివున్నాడు.
రంగు : చామనచాయ, ఎత్తు : 5.4
వ్యక్తి ఆచూకీ తెలిపినవారికి రూ. 5000/- లు పారితోషికము ఇవ్వబడును.
✆ లింగమ్మ : 70750 69155

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No.1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికే పంపగలము. ✆ 95420 36677, 95537 86677.

REAL ESTATE

GENERAL

రాజధాని అమరావతిలో గజం 4100/-, కమర్షియల్ 10,000/-, స్పాట్ రిజిస్ట్రేషన్ మరియు 24 నెలల ఇన్‌స్టాల్‌మెంట్స్, ప్లాట్ 30 లక్షలు 15000 రెంటు. లోన్ కలదు. 96035 30555.

FLAT FOR SALE

INNER RING ROAD

బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్, మంత్లీ ఇన్‌కమ్ ప్రాపర్టీ 12 సం॥ల అగ్రిమెంట్‌తో నెలకు 18-35 వేల ఆదాయం రాగల (1206 నుండి 2506 చ.అ) 2&3 BHK ఫ్లాట్స్ స్పాట్ రిజిస్ట్రేషన్. ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు. 88855 72799.

PALAKALURU ROAD

3BHK Flats for sale: 1520 Sft Fully Finished New Flats are available for sale at Rathnagiri Colony; Palakaluru road, Guntur. Ph: 77999 99940.

GENERAL

గుంటూరు, శాంతినగర్, 4వ లైన్, D.No. 95-13-434, లక్ష్మీ నివాస్ అపార్ట్‌మెంట్స్, 930 S.Ft., 2 B/R ఫ్లాట్, కార్ పార్కింగ్, త్రాగునీటి సౌకర్యముతో ఫ్లాట్ అమ్మకం. 80089 60024.

HOUSE FOR SALE

GENERAL

12వ లేన్, నెహ్రూనగర్ గుంటూర్‌లో కిచెన్ & బెడ్‌రూమ్ చొప్పున 4 పోర్షన్లు ఒక షాపు సుమారు 20 వేలు అద్దెలు వచ్చు 176 చ॥గజాలు ఇల్లు అమ్మకము. ఫోన్: 92925 06789.

పొన్నూరు రోడ్డు ఓల్డ్ గుంటూరు పోలీస్ స్టేషన్‌కు 200 మీ॥ దూరంలో తూర్పు ఫేస్ 100 Ft. రోడ్డుతో 272 గ॥ల రెండు అంతస్తుల ఇల్లు అమ్మకానికి కలదు. అద్దె 45000 వచ్చును. సంప్ర॥ ఫోన్ నెం. 63027 27534.

LAND FOR SALE

GENERAL

తెనాలి, నారాకోడూరు మధ్య విజ్ఞాన్ యూనివర్సిటీ సమీపంలో (వెనక) ఉత్తర పడమర రోడ్డు, బోర్, మామిడి, కాయకూరల వ్యవసాయ సాగుభూమి 6 ఎకరముల అమ్మకమునకు కలదు. ✆ : 70934 99168.

PLOT FOR SALE

BAPATLA

బాపట్ల శిఖరం వారి స్టేట్ నందు ఈస్ట్ ఫేసింగ్ 24 సెంట్స్/ 1161.60 Sq. Yards స్థలం అమ్మకముకు/ డెవలప్మెంట్‌నకు కలదు. అమ్మకమునకు ప్రాధాన్యత. No. 89858 51142.

GENERAL

గుంటూరు, SVN కాలనీ, తారకరామా నగర్, ఇన్నర్ రింగ్ రోడ్డు 3 ఫేజ్ మధ్యలో తూర్పు - పడమర ఫేస్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. (కొ॥ 33x45= 165 గజాలు) చ॥గ॥ 25,000/- స్పాట్ రిజిస్ట్రేషన్. 91107 04446.

గుంటూరు, వెనిగండ్ల, జనచైతన్య వెంచర్ - ప్రగతి, 209 చ॥గ॥ ఈస్ట్ ఫేస్, Huda అప్రూవ్డ్ స్థలం అమ్మకానికి కలదు. 86887 68229.

PROPERTY FOR SALE

GENERAL

Commercial Building Sale 252 చ. గజాలలో మారీస్‌పేట, తెనాలి 3 టౌన్ పోలీసు స్టేషన్ దగ్గర. Ph: 9346990192

JOBS

Wanted Only Female - Admin Office any Degree & Accountant with 5 Years plus Exp. @ Mara Signex, Guntur. Ph: 94999 66666.

Join our free internship at Vaimanasoft Pvt. Ltd., (Job for Top performers!) Contact: Vaarahi Enclave, 2nd Flr, Brodipet 6/13, Guntur. 0863-4051927, Mail: contact@vaimanasoft.com

Sri Saradha Niketan public School- Martur Bapatla. distric wanted jobs Maths, Physics, Chemistry Qua: - M.sc, Bed (Exp-5-10 years) With JEE-MAINS, NEET) Data entry operators: -2. Cont: 70957 23036, 93988 32060

Wanted Well Qualified full time Teachers for all Subjects. The Central Public School, Brodipet, 4/19, Guntur. 0863-2233291.

WANTED Male Administrative Staff Qualification Any Degree/ P.G. Age Limit: 25 to 45 Years. Salary upto 20,000/-. Location: Master Minds College, Nellore, Interested Candidates may Whatsapp their resume to the Contact Number: 89784 80430.

Wanted Helpers For packaging industry in Guntur. Good salary. Ph: 81799 68499, 98490 62613

A Reputed Real Estate Company Requires Female Telecallers & Marketing Executives, Salary, Commission & Incentives. Ph: 9182550046.

WALK-In-Interview: Sample Collection Boys, Disha Diagnostics, Old Club Road, Opp: Tulasi Hospitals, Kothapet, Guntur. Ph: 89789 88114.

Wanted 10 Unemployees to work in reputed organisation. ✆: 77290 15053.

Wanted Teachers Pre-Primary, Primary & High School for all subjects Contact Immediately. Guntur. Ph: 97017 59405.

Wanted Experienced Faculties to Teach MS Office, C Language, Java, Python, Tally, SAP, DTP, Auto CAD, 3DS Max, Revit, Catia, Nx Cad. Ph: 99859 43539.

Sri Balaji Hospitals Wanted Pharmacy Experience Sales and Accountant. Ph: 91542 61021.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్ టైం/ ఫుల్ టైం బిజినెస్ పార్ట్నర్‌గా చేరండి. అధిక కమిషన్ సంపాదించుకోండి. విద్యార్హత: 10th, వయస్సు: 30 - 65 సం॥. 79892 46788.

పార్ట్ టైమ్ టీచర్స్ కావలెను; CBSE 10th మ్యాథ్స్ & సైన్స్ (E/M) ఆన్‌లైన్ ట్యూషన్ కోసం 5+ Yrs అనుభవం, తగిన అర్హత ఉన్నవారు సంప్రదించండి. జీతం: 10-15k, 4/11 బ్రాడీపేట, గుంటూరు. ✆ 96407 76650.

ప్రముఖ డోర్ కర్టెన్ షాప్‌లో పనిచేయుటకు 10th క్లాస్ చదివిన సేల్స్ గర్ల్స్ కావలెను. అరండల్‌పేట, గుంటూరు. సంప్ర వేళలు: 10 AM - 8 PM. 90324 55294.

టైటానిక్ శారీస్ & రెడీమేడ్ షోరూం నందు సేల్స్‌మెన్స్, హెల్పర్స్ (లేడీస్/ జంట్స్) కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్. ఆకర్షణీయమైన జీతం + కమీషన్. జిన్నా టవర్ సెంటర్ దగ్గర, గుంటూరు. 83743 22833.

గుంటూరు ప్రఖ్యాతిగాంచిన ఎలక్ట్రికల్ 2 వీలర్ కంపెనీ నందు పనిచేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, త్రీ వీలర్ షోరూంకి సర్వీస్ సూపర్వైజర్ కావలెను. 98665 15888.

AGM/RM/BM కావలెను. P.G., వివిధ రంగాలలో 10 సం॥ అనుభవం, 45 సం॥లలోపు వారు గుంటూరులో పనిచేయుటకు తమ రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.

త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం:18K. ✆ 85209 80099, 85208 74499.

గుంటూరు మెయిన్ రోడ్డు లక్ష్మీపురం నందు ట్రాన్స్ మీడియా టెక్నాలజీస్ (A.P.) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేయుటకు టెక్నీషియన్స్ (M) కావలెను. 90598 12327, 96034 33369.

బ్రిలియంట్ స్టార్స్ ప్లే స్కూల్ పెదకాకానిలో పనిచేయుటకు "లేడీ టీచర్స్" కావలెను. మాంటెస్సోరి చేయగలిగే కాలేజీ విద్యార్థినులకు సమ్మర్ ఉద్యోగ అవకాశం. వసతి కలదు. & వెస్టన్ లేడీ డాన్స్ టీచర్ కావలెను. ✆: 73823 20815.

గుంటూరు, హౌసింగ్ బోర్డు కాలనీ నందు పనిచేయుటకు డిగ్రీ (Freshers also) అర్హత గల కంప్యూటర్ మోనిటరింగ్ ఆపరేటర్ (Males Only) కావలెను. జీతం: రూ. 15,000/- నుండి 20,000/-. ✆: 98855 66044.

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు P.A. మరియు ఫ్రంట్ ఆఫీసు స్టాఫ్ (స్త్రీ) కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. Qly: డిగ్రీ. సంప్ర॥ 95537 68889.

గుంటూరులోని ప్రముఖ బ్యాంకు DSA లోన్స్ ఆఫీస్‌లో పనిచేయుటకు లేడీ టెలికలర్స్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. లోన్స్ వర్క్‌లో అనుభవము ఉండవలెను. 94403 10035.

పద్మప్రియ ఫైనాన్స్ గుంటూరు నందు పనిచేయుటకు అనుభవం కలిగిన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ మరియు బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్రదించగలరు. ✆: 93944 46449.

రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ తెనాలి బ్రాంచ్‌కు వివాహిత మహిళా ఉద్యోగులు కావలెను. Q: డిగ్రీ. 30-45 సం॥ తెనాలికి 5 కి.మీ. లోపు వారు మాత్రమే. ✆: 98499 94227.

నల్లపాడు, కైలాసగిరి వద్ద వైభవ్ ఇండస్ట్రీస్ వారి ప్యాకేజ్డ్ & డ్రింకింగ్ వాటర్ బాటిల్స్ సప్లైయుటకు డీలర్స్/ Marketing Executives కావలెను. సంప్ర॥ 94419 12776.

తెనాలిలో ప్రముఖ ఫ్లెక్స్ ప్రింటింగ్ సెంటర్ నందు పనిచేయుటకు ఫోటోషాప్ నందు అనుభవం కలవారు కావలెను. సంప్ర॥ 99669 68070, 95738 37921.

డెలివరి బాయ్స్ - 2 కావలెను. సంప్ర॥ శ్రీ వెంకటేశ్వర రైస్ ట్రేడింగ్ కంపెనీ; 2/18 బ్రాడీపేట; గుంటూరు లోకల్ వారికి ప్రాధాన్యత. Ph: 92464 84356 & 0863-2222647.

గుంటూరు సిటీలోని L.V.R. క్లబ్ నందు పనిచేయుటకు A/c టెక్నీషియన్ కావలెను. ✆ : 94932 69918.

FACULTY/ TEACHERS

Wanted Faculty Akshara E.M. High School Challagundla (V), Nakarikallu (M), Palnadu (Dt) Pre-Primary School Level: Mother Teachers (only ladies) Primary School Level: 1st to 5th (All Subjects) (Only Ladies) High School Level: 6th to 10th (All Subjects). Spoken English Teacher, P.E.T., Front Office: Computer Operator - DTP, Udise Plus Work and also Wanted Principle. Con: 95029 22661, 77300 77033

Wanted Experienced Teachers for All Subjects in Guntur from Pre-KG to 10th, IIT, PET. English Fluency is Must. ✆ 9447660603.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

తెనాలి

• తెనాలి • పొన్నూరు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల నిమిత్తం శనివారం తెనాలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు.

పెదకాకాని: తీగల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ పీహెచ్ ఖాన్ తెలిపారు. పెదకాకాని, వెనిగండ్ల, నంబూరు, కొప్పురావూరు, అగతవరప్పాడు, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, రామచంద్రపాలెం, వెంకటకృష్ణాపురం, డీబీపాలెం, అనుమర్లపూడి, తంగెళ్లమూడి, గోళ్లమూడి గ్రామాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 4,300

అత్యల్పం: 2,500

సగటు: 3,600

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

త్వరలోనే జొన్న కొనుగోలు కేంద్రాలు

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జొన్న కొనుగోలుకు ప్రభుత్వం త్వరలోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలిలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ 45 వేల టన్నుల జొన్న సేకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, తెనాలిలోనూ కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి వస్తాయన్నారు. గత వైకాపా ప్రభుత్వం దళారుల వద్ద నుంచి పంట కొనుగోలు చేసి రైతులను దగా చేసిందని, కూటమి ప్రభుత్వం కచ్చితంగా రైతులకు మేలు చేసేలా ప్రక్రియ నిర్వహిస్తుందన్నారు. దళారులు తలదూరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడానికి రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. ఈరోజు 25 వరకు వివిధ అర్జీలు వచ్చాయని, గత జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టిస్తామని నగదు వసూలు చేసి కట్టని వారిపై పోలీసులకు ఫిర్యాదులు చేస్తే పట్టించుకోవడం లేదని అర్జీల్లో పేర్కొంటున్నారని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్జీల స్వీకరణ ప్రతి శుక్రవారం కొనసాగుతుందని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలిలోని కొత్తపేట బాలికోన్నత పాఠశాల మార్గంలో రోడ్డు వెంట నిర్మాణ వ్యర్థాలు పడి ఉన్నాయి. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- తనూజ, కొత్తపేట**

✔ వాటిని తొలగింపజేస్తాం. **- బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్**

వీధి దీపాలు వెలిగాయి: తెనాలి బస్టాండ్ మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఈ నెల 9న మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలుపగా సిబ్బంది మరమ్మతులు పూర్తి చేశారు.

వ్యర్థాలు తరలించారు: తెనాలి కొత్తపేటలో రోడ్డు వెంట వ్యర్థాలు తరలించ లేదని స్థానికులు ఈనెల 9న మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలియజేయగా సిబ్బంది వాటిని తొలగించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

స్పందనకు వందనం

పేరంటాలమ్మ సేవలో ఆలపాటి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ ఐతానగర్‌లోని వెంకయ్య గౌరమ్మ స్వామివార్ల పేరంటాలమ్మ తిరునాళ్ల గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి పట్టుచీర సమర్పించారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని పీఎల్‌రావు భవన్‌లో రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు.

రైతులకు మేలు జరిగేలా..

గాడిన పడుతున్న తెనాలి మార్కెట్ యార్డు సేవలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

రైతులకు మరింత మేలు జరిగేలా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డును కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన యార్డులో ప్రధాన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇతర ఏర్పాట్లు చేస్తోంది.

మార్కెట్ యార్డు నిమ్మ ఎగుమతులకు కేంద్రం. నిమ్మ లోడు లారీలు రాకపోకలు చేసే ప్రాంతంలో సరైన రోడ్డు లేక అప్పుడప్పుడు అవి కూరుకుపోవడం, ఇతర సమస్యలు తలెత్తేవి. అదే విధంగా గతంలో మరుగుదొడ్లు అందుబాటులో లేవు. యార్డు శివారు ప్రాంతాల్లో ఉన్న పాత మరుగుదొడ్లు రైతులకు, కార్మికులకు ఉపయోగపడ లేదు. ఈ రెండు ప్రధాన సమస్యలకు కూటమి ప్రభుత్వం పరిష్కారాలనిచ్చింది. నిమ్మ వ్యాపార కేంద్రాల వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.37 కోట్లు, రెండు మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం కోసం రూ.34.40 లక్షలు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం ప్రారంభం కాగా, మరుగుదొడ్ల పనులు తుది దశలో ఉన్నాయి.

గోదాముల్లో రైతులు నిల్వ చేసుకున్న ధాన్యం బస్తాలు

ఉత్పత్తుల నిల్వ: గత వైకాపా పాలనలో పూర్తిగా పక్కన పెట్టేసిన రైతు బంధు పథకాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి పునఃప్రారంభించింది. దీంతో తెనాలి మార్కెట్ యార్డులో ప్రస్తుతం 22 మంది రైతులు 4,076 బస్తాల ధాన్యాన్ని (బస్తా 75 కేజీలు) నిల్వ చేసుకున్నారు. వీరిలో నలుగురు రైతులు రూ.6.09 లక్షలను రుణంగా కూడా పొందారు. గతంలో రైతులు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం లేక పంట చేతికి అందిన వెంటనే అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు తమకు నచ్చిన ధర వచ్చే వరకు నిల్వ చేసుకునే అవకాశం అంది రావడంతో పాటు నిల్వపై అత్యవసర ఖర్చుల నిమిత్తం యార్డు నుంచి రుణం పొందే వెసలుబాటు కూడా రైతులకు దక్కింది.

తుది దశలో మరుగుదొడ్ల నిర్మాణ పనులు

లక్ష్యాన్ని అధిగమించి ఆదాయం: మార్కెట్ యార్డుకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.6.60 కోట్లు ఆదాయాన్ని నిర్దేశించగా.. రూ.6.71 కోట్ల సాధించి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ క్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.7.65 కోట్ల ఆదాయాన్ని మార్కెటింగ్ శాఖ నిర్దేశించింది.

మరింత మంది రైతులకు అవకాశం

- జొన్నలగడ్డ వెంకటసుబ్బారావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి, తెనాలి మార్కెట్ యార్డు

రైతు బంధు పథకం కింద మరింత మంది రైతులకు అవకాశం ఉంది. సద్వినియోగం చేసుకోవచ్చు. యార్డుకు ప్రహరీ, గోదాముల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు పంపించాం. ఆయా పనులు కూడా త్వరలోనే మంజూరవుతాయి. ప్రస్తుతం జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులు ఈ నెలాఖరుకు, రోడ్డు పనులు మూడు నెలల్లో పూర్తవుతాయి.

సర్పంచి మృతి

కొల్లిపర, న్యూస్‌టుడే: చక్రాయపాలెం సర్పంచి చందు బాబూరావు (55) అనారోగ్య సమస్యలతో శుక్రవారం మృతి చెందారు. మంత్రి నాదెండ్ల మనోహర్, పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు.

వైభవంగా బ్రహ్మోత్సవం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలోని శ్రీభూసమేత లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థాన బ్రహ్మోత్సవం వైభవంగా జరుగుతోంది. శుక్రవారం స్వామి వారి శేష వాహన సేవలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్వాహక కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

శేష వాహన సేవ

విష్ణుమూర్తిగా భావనారాయణస్వామి

పొన్నూరు,న్యూస్‌టుడే: పొన్నూరు పట్టణంలోని సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి వారు విష్ణుమూర్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చేబ్రోలు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని చేబ్రోలు పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు చేబ్రోలుకు చెందిన వ్యాపారి గుండవరం, గొడవర్రు గ్రామంలో కార్డుదారుల నుంచి చౌక బియ్యం కొనుగోలు చేసి వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామానికి ఆటోలో తరలిస్తుండగా పోలీసులు దాడి చేశారు. 7.5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోడ్రైవర్ పాపయ్యను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ త్రిమూర్తి, పక్కన డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు

తక్కెళ్లపాడు(పెదకాకాని), న్యూస్‌టుడే : విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం క్రీడా కార్యదర్శి డాక్టర్ త్రిమూర్తి తెలిపారు. తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలోని స్టూడెంట్ కౌన్సిల్ శుక్రవారం నిర్వహించిన క్రీడా దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణతో కూడిన జీవితం ఉంటుందన్నారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబార్ డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ దశక

క్రమశిక్షణ అలవర్చుకోండి

నంబూరు(పెదకాకాని), న్యూస్‌టుడే : ఆశయాల సాధన కోసం ఎన్‌సీసీ క్యాడెట్లు క్రమశిక్షణతో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని విశిష్ట సేవా మెడల్ గ్రహీత, విశ్రాంత ఆర్మీ అధికారి మేజర్ జనరల్ డాక్టర్ దశక సూచించారు. నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ(వీవీఐటీయూ)లో నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ వార్షిక శిక్షణ శిబిరంలో క్యాడెట్లను ఉద్దేశించి శుక్రవారం ఆయన మాట్లాడారు. 10ఏ బెటాలియన్ కమాండింగ్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ మాట్లాడుతూ యుద్ధ సమయంలో అవసరమైనప్పుడు ప్రభుత్వం యువత సాయం కోరితే కచ్చితంగా ముందుకు సాగాలని చెప్పారు.

భవన మరమ్మతుల్లో తాత్సారం తగదు

కమిషనర్ శేషన్నకు సూచనలు చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ కొత్తపేటలోని మహిళా మండలి భవనం ఈనెలలో ప్రారంభించుకోవాలని చెప్పినా మరమ్మతు పనుల్లో తాత్సారం చేయడం తగదని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. అనుకున్న సమయానికల్లా వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. బోసురోడ్డులోని దుకాణాల ముందు మురుగు నీరు పారుదల కాకుండా మెట్లు నిర్మిస్తే ఎందుకు తొలగించ లేదని పట్టణ ప్రణాళికా అధికారులను ప్రశ్నించారు. ఉపేక్షించవద్దని ఆయన పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని, సాయంత్రం మరోసారి వచ్చి చూస్తానని కమిషనర్‌ను హెచ్చరించారు. జన సంచారం ఉన్నప్పుడు మున్సిపల్ అద్దె దుకాణాలు కూల్చకుండా రాత్రి పూట చేస్తే బాగుండేదని ఆయన సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

✶ మంత్రి మనోహర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మున్సిపల్ కూరగాయల మార్కెట్ భవనంలోకి మార్చే పనులు వేగిరం చేయాలని ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులకు సూచించారు. ఆమె శుక్రవారం కమిషనర్ శేషన్నతో కలిసి కూరగాయల మార్కెట్ భవనాన్ని పరిశీలించారు.

చెప్పినా వినరు.. సమస్యలు పట్టించుకోరు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

ఎస్‌బీఐ పక్క రోడ్డులో తాగునీటి పైపులు వేసి కాంక్రీట్ చేయకుండా వదిలేశారిలా..

గేదెలకు స్థావరంగా మారిన పార్కు

తెనాలి ఐతానగర్ ప్రాంతంలోని 1, 2, 39, 40 వార్డుల్లో పలు సమస్యలు తిష్టవేశాయి. ఈ ప్రాంతంలో సుమారు 15 వేలకు పైగా జనాభా ఉన్నారు. వీరు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని కౌన్సిలర్లు సమావేశాల్లో ప్రస్తావించినా అధికారులు పట్టించుకుంటున్నది లేదు. ఈ ప్రాంతంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించినప్పుడు.. ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే కాల్వలు శుభ్రం చేస్తున్నారని.. దోమకాటుతో అల్లాడుతున్నామని జనం సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారానికి కనీసం రెండుసార్లు కాల్వలు శుభ్రం చేయిస్తారని మంత్రి తెలిపారు. తీరా తగినంత మంది సిబ్బంది లేరని ఆచరణలో అమలు చేయలేదు.

పార్కును పట్టించుకోలేదు... ఐతానగర్‌లోని పొట్టి శ్రీరాములు పార్కుకు గేటు, గోడలు నిర్మించకుండా వదిలేశారు. అందులో తెదేపా ప్రభుత్వ హయాంలో ఎస్సీ ఉప ప్రణాళిక నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన అంబేద్కర్ భవనం పూర్తి చేయలేదు. అధికారులు ఈ పార్కును పట్టించుకోకపోవడంతో సమీపంలోని వారు పశువులను కట్టేస్తున్నారు.

మరమ్మతులకు నోచని సామాజిక భవనం.. ఈ ప్రాంతంలోనే పెళ్లిళ్లు తదితర ఇతర కార్యక్రమాలు చేసుకోవడానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సామాజిక భవనం నిర్మించారు. కాలక్రమంలో అది పగళ్లిచ్చి ప్రమాదకరంగా మారింది. దీనికి మరమ్మతులు చేయించలేదు. అందులోనే బిక్కు బిక్కుమంటూ శుభకార్యాలు జరుపుకుంటున్నారు.

☛ ఐతానగర్ ప్రధాన రోడ్డును ఆనుకొని భూగర్భంలోని తాగునీటి పైపు లీకు అరికట్టక నీటిని వృథాగా కాల్వలోకి మళ్లించారు. ఏటా దీని మరమ్మతుల పేరుతో రూ.లక్షల ప్రజాధనం ఖర్చు చేస్తూనే ఉన్నారు. వీటిని ఇంజినీర్లు ప్రణాళికా బద్ధంగా చేయించక సమస్యలు వస్తున్నాయి. ఎస్‌బీఐ, హయ్యర్‌పేట, వీఎస్ఆర్ ఎన్‌వీఆర్ కళాశాల తదితర అంతర్గత రోడ్ల మధ్య భూగర్భంలో తాగునీటి పైపులు వేసి పూడ్చి కాంక్రీట్ వేయకుండా వదిలేయడంతో గుంతలతో జనం అవస్థలు పడుతున్నారు. లింగారావు సెంటర్ నుంచి గోలిడొంక వరకు పైపులైను పనులకు అనేక సార్లు టెండర్లు పిలిచి.. గుత్తేదారును ఎంపిక చేసినా మొదలు కాలేదు.

☛ నియంత్రణ చర్యల్లో తాత్సారంతో వీధి కుక్కలు కరిచి ఈ ప్రాంత వాసులు అనేక మంది ఆసుపత్రి పాలయ్యారు.

☛ నేలపాడు రోడ్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేదు. దీంతో విష పురుగులు వస్తున్నాయని వైద్య సిబ్బంది, రోగులు ఆందోళన చెందుతున్నారు.

☛ గ్యాస్ ఆధారిత దహనవాటిక పనులు సగం చేసి నిలిపేశారు.

ప్రయివేటు వాహనాలపై మోజు

పాడైన కాంపాక్టర్లు బాగు చేయించకుండా ప్రజాధనం దుబారా

వాహనాల షెడ్డులో కాంపాక్టర్లు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:

పట్టణ పరిధిలోని 40 వార్డుల్లో సేకరించిన 95 టన్నుల చెత్తను నాయుడుపేట జిందాల్ పరిశ్రమకు తరలించాలి. ఇందుకు పనిచేయాల్సిన ఏడు మున్సిపల్ కాంపాక్టర్లలో రెండు పనిచేయడం లేదు. ఈ ప్రభావం వ్యర్థాల తరలింపుపై పడింది. చెత్త పేరుకు పోతోంది. ఆ రెండింటిని వెంటనే బాగు చేయించకుంటే చెత్త సమస్య జటిలమవుతుంది. గత వైకాపా పాలనలోనూ ఇలాగే ట్రాక్టర్లు పలుసార్లు పనిచేయకున్నా.. మున్సిపల్ అధికారులు ఉద్దేశపూర్వకంగా మరమ్మతులు చేయించకుండా మూలన పెట్టేవారు. ఫలితంగా పేరుకుపోయిన చెత్త కొండను తలపించింది. దీన్ని సాకుగా చూపి చెత్త తరలించడానికి అద్దె జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లను వినియోగించారు. వీటికి రూ.అరకోటి పైన ప్రజాధనం దుబారా చేశారు. ఇప్పటి పరిస్థితిలోనూ మార్పు లేదు. ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసుకోవడంలో కలిగే ప్రయోజనాలకు ఆశించి..పాడైన వాహనాలకు మరమ్మతులు చేయించట్లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. దీనిపై కమిషనర్ శేషన్న మాట్లాడుతూ చెత్త పేరుకు పోకుండా అద్దె వాహనాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పాడైన వాటిని ఇంజినీర్లు బాగు చేయించాలని తెలిపారు.

22న హనుమజ్జయంతి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ సుల్తానాబాదులో కొలువైన ఆంజనేయస్వామి దేవస్థానంలో 22న హనుమజ్జయంతి వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీను, సురేష్‌బాబు, గురునాథ గుప్త, వేణు తెలిపారు. వీరు శుక్రవారం మాట్లాడుతూ ఏటా మాదిరిగా భక్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

పాలపర్రు పాఠశాల వజ్రోత్సవం నేడు

పాలపర్రు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: పాలపర్రు శ్రీనారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం శనివారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆవరణను పూర్వవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దారు. అతిథులకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆహ్వాన సంఘ, పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షులు ఎం. మణికుమార్, ఎం. రమేష్‌బాబు తెలిపారు. ఉదయం కార్యక్రమానికి కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్‌కుమార్, విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, మాజీ మంత్రి డి.మాణిక్యవరప్రసాద్, సాయంత్రం 5.30 గంటలకు జరిగే కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, పుల్లారావు, శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య హాజరవుతారని వారు పేర్కొన్నారు.

సందేశాత్మకంగా నాటికలు

పొన్నూరు: పొన్నూరు కళా పరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలులో జరుగుతున్న ఆహ్వాన నాటికల పోటీల్లో శుక్రవారం అసత్యం, దేవరాగం, 27వ మైలు రాయి నాటికలు ప్రదర్శించారు. ఈ నాటికలు ప్రేక్షకులకు సందేశాన్నిచ్చాయి. ఈ సందర్భంగా పొన్నూరు నటరాజ కూచిపూడి నాట్య నిలయం విద్యార్థులు ప్రదర్శించి శాస్త్రీయ నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. పరిషత్తు ప్రతినిధులు పర్యవేక్షించారు.

27వ మైలు రాయి నాటికలో ఒక సన్నివేశం

వాహనం ఢీకొని బాలికకు గాయాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ పోతురాజు కాలనీలో ఇంటి ముందు పానీ పూరి తింటున్న బాలికను, అదే ప్రాంత వాసి నడుపుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో బాలిక గాయపడింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు.

హత్య జరిగిందని తప్పుడు సమాచారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలంలోని ఒక గ్రామంలో హత్య జరిగిందంటూ శుక్రవారం రాత్రి పోలీసులకు ఫోన్ కాల్ వచ్చింది. విచారించిన పోలీసులు అది తప్పుడు సమాచారం అని నిర్ధారించుకున్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారి గురించి ఆరా తీస్తున్నారు.

వ్యభిచార గృహాలపై దాడులు

తెనాలి టౌన్: పట్టణ చెంచుపేట, పాండురంగపేట ప్రాంతాల్లోని వ్యభిచార గృహాలపై తెనాలి త్రీటౌన్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఇద్దరు యువతులు, నిర్వాహక మహిళలు మరో ఇద్దరితోపాటు మొత్తం పది మందిని అదుపులోకి తీసుకున్నారు.

అల్లుడిపై దాడి

తెనాలి టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడిపై భార్య కుటుంబ సభ్యులు దాడి చేసిన ఘటన కరెవరం కాలువ కట్టపై జరగగా కేసు నమోదు చేసినట్లు గ్రామీణ పోలీసులు శుక్రవారం తెలిపారు.

ఘర్షణపై ఫిర్యాదు

తెనాలి టౌన్: తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో వ్యక్తిగత విషయాల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో మహిళ, యువకుడు గాయపడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ పోలీసులు శుక్రవారం తెలిపారు.

రహదారిపై తొలగించని కొమ్మలు

దారిలోకి వేలాడుతున్న చెట్టు కొమ్మ

ప్రమాదకరంగా చెట్టు కొమ్మలు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: గురువారం వీచిన బలమైన గాలులకు పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డులో విరిగిన చెట్ల కొమ్మలు అలాగే ఉన్నాయి. వాటిని ఇప్పటికీ తొలగించలేదు. అవి ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఎక్కడ మీద పడతాయో అని వాహన చోదకులు భయపడుతున్నారు. 24 గంటలు గడిచినా ఆర్అండ్‌బి అధికారులు కొమ్మలు తీయించక పోవడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

నెహ్రూనగర్: రైలులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని శుక్రవారం గుంటూరు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో సీఐ అంజిబాబు నిందితుడి వివరాలు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగా నాయక్‌లు తమ రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేశారు. లాభం కోసం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించడానికి రైలులో తీసుకు వెళుతున్నారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐలు అంజిబాబు, శంకర్‌రావు, ఎస్సై లక్ష్మీనారాయణరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సోమశేఖర్, వాసులు శుక్రవారం 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేశారు. అజిత్‌కుమార్ జైన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు భోగానాయక్ పరారీలో ఉన్నాడని, ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని సీఐ అంజిబాబు తెలిపారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మహిళలతో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

శేకూరు(చేబ్రోలు),న్యూస్‌టుడే: స్వయం సహాయక బృంద సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రభాత్ త్యాగి అన్నారు. శుక్రవారం మండలంలోని శేకూరు పాలెంలో స్త్రీనిధి రుణాలు తీసుకున్న సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రుణాలు పొందిన తీరు, ఏర్పాటు చేసుకున్న యూనిట్లు, తిరిగి వాటిని చెల్లించిన విధానం అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ జనరల్ మేనేజర్ రమేష్, స్త్రీ నిధి మేనేజర్ శ్రీనివాస్ సిద్ధి, స్థానిక ఏపీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తెనాలి టౌన్: పట్టణంలోని కాలనీలో శుక్రవారం రాత్రి సుమారు 21 సంవత్సరాల యువకుడు తమ నివాస గృహంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. మృతుడు బీటెక్ విద్యార్థి అని సమాచారం. అయితే ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

తాడేపల్లి: విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు. తాడేపల్లికి చెందిన కృష్ణ (44) రహదారి దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈనెల 7వ తేదీ జరిగిన ఈ ఘటనలో గాయపడ్డ అతన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ మాజీ ఛైర్మన్ వెంకట్రావుకు సతీ వియోగం

తెనాలి (కొత్తపేట): మున్సిపల్ మాజీ ఛైర్మన్, తెదేపా నాయకుడు పెండేల వెంకట్రావు భార్య పద్మావతి(70) శుక్రవారం మారీసుపేటలోని స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆమె భౌతికకాయానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు, పలువురు తెదేపా నాయకులు సంతాపం తెలిపారు.

పత్రిక ప్రకటన

నా క్లయింట్స్ గుంటూరు జిల్లా తెనాలి టౌన్ ఐతానగర్ కాపురస్తులు అయిన గూడపాటి శారద W/o. (Late) శ్రీ కృష్ణదేవరాయలు, గూడపాటి పవన్ కళ్యాణ్, S/o. శ్రీకృష్ణదేవరాయలు గార్ల సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... ది. 10-10-2024వ తేదిన తెనాలి మెయిన్ సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో నమోదు కాబడిన డాక్యుమెంట్ నెంబర్ 234/2024 అను వీలునామా ద్వారా మా క్లయింట్ అయిన గూడపాటి శారద, గూడపాటి పవన్ కళ్యాణ్ గార్లకు ఈ క్రింద తెలుపబడిన ఆస్తులు సంక్రమించి ఉన్నవి.

01వ అయిటము: గుంటూరు డి. తెనాలి సబ్ డి. యిలాకా నేలపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గ్రామ డి.నెం. 45/2 మరియు 48/3 మింజుమలె య. 1-67 సెంట్లుకు సరియగు హె. 0-678 ర్లు శేరి మాగాణి భూమి.

02వ అయిటము: గుంటూరు డి. తెనాలి సబ్ డి. యిలాకా నేలపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గ్రామ డి.నెం. 300/4 మింజుమలె య. 1-13 సెంట్లుకు సరియగు హె. 0-457ర్లు శేరీ మాగాణి భూమి.

పై తెలిపిన ఆస్తులు గురించి ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్న ఎడల తెనాలి ఎమ్మార్వో వారి కార్యాలయంలో గాని, నా క్లయింట్లు అయిన గూడపాటి శారదా, W/o. గూడపాటి శ్రీకృష్ణదేవరాయలు, గూడపాటి పవన్‌కళ్యాణ్, S/o. శ్రీకృష్ణదేవరాయలు గానీ, మాకు గాని 10 రోజులు లోపల తెలుపగలరు. లేనిచో పరోక్షముగా తీర్మానించెదరు.

గూడపాటి శారద, W/o. శ్రీకృష్ణదేవరాయలు
గూడపాటి పవన్‌కళ్యాణ్, S/o. శ్రీకృష్ణదేవరాయలు, 85007 47272

ఆవుల భానుప్రకాష్, అడ్వకేట్, తెనాలి, 94415 25944

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:

★ ప్రత్తిపాడు తహసీల్దారు కార్యాలయం ఎదురు రోడ్డులో కుప్పలుగా పడేసిన చెత్త, వ్యర్థాలను తొలగించాలని స్థానికులు 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 9న ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి షేక్. ఖాజా స్పందించి చెత్తకుప్పలను తొలగింపజేశారు.

స్పందనకు వందనం

★ ప్రత్తిపాడు 4వ వార్డులో శ్రీసీతారామ స్వామి ఆలయ వీధిలో కాల్వల్లో మురుగు పారుదల లేదని స్థానికులు 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 9న ప్రచురితమైన కథనానికి పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి షేక్. ఖాజా స్పందించి కాల్వల పూడిక తీయించారు.

★ యనమదల ప్రధాన రహదారిలో కాల్వలో చెత్తపడేయడంతో మురుగునీరు పారుదల లేదని స్థానికులు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. కార్యదర్శి పి. శ్రీనివాసరావు స్పందించి కాల్వలో పడేసిన చెత్తను శుభ్రం చేయించారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే

'ఈ రోడ్డు ఇంతేనా' శీర్షికన 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ఈనెల 4న ఈనాడులో

బాగుచేస్తున్న పేరకలపూడి-పెదపాలెం రోడ్డు

వచ్చిన కథనానికి స్పందన లభించింది. పెదపాలెం-పేరుకలపూడి రోడ్డు విషయాన్ని ఈనాడు ప్రచురించింది. శుక్రవారం నుంచి రోడ్డు బాగు చేసే పనులు మొదలుపెట్టారు. తొలుత గుంతలు పూడుస్తున్నారు. తర్వాత తారువేయనున్నారు.

? ప్రత్తిపాడులోని ఏకదండయ్య సత్రం వీధిలో చెత్తను కుప్పలుగా పడేస్తున్నారు. - **స్థానికులు**

✔ కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తాం. **-షేక్.ఖాజా, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

? నడింపాలెంలోని బోయకాలనీలో మురుగు కాల్వల్లో మురుగు నీటి పారుదల లేదు. - **స్థానికులు**

✔ పారిశుద్ధ్య కార్మికులతో కాల్వలను తీయిస్తాం. **-జీవీఆర్‌కే మూర్తి, కార్యదర్శి.**

మట్టి నమూనాల సేకరణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని సాగు భూములకు సంబంధించిన భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని తుళ్లూరు వ్యవసాయ అధికారిణి కె. మనోరంజని తెలిపారు. పరీక్షలు చేయదలచుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఈ పరీక్షల ద్వారా భూమిలో సూక్ష్మ పోషకాల స్థాయి, నేల స్వభావాన్ని తెలుసుకోవచ్చన్నారు.

'అన్నదాత సుఖీభవ' పేర్లు నమోదు చేసుకోండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 14 వేలు సాయం పొందేందుకు సొంత పొలం ఉన్న రైతులు తమ పేర్లను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని ఏవో శిరీష శుక్రవారం తెలిపారు. 1బి/పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకెళ్లాలన్నారు.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగించాలి

మంగళగిరి, న్యూస్‌టుడే: జనగణనతోపాటు సమగ్ర కులగణన చేపడుతున్న నేపథ్యంలో ప్రజల ఆకాంక్షల మేరకు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ఏఐతో విప్లవాత్మక మార్పులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బీసీఏ, ఎంసీఏ విభాగాలు సంయుక్తంగా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బహుళ శాఖా పరిశోధనలపై జాతీయ సదస్సును కేఎల్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ సుబ్రమణ్యం శుక్రవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సురేష్‌వర్మ పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయని తెలిపారు. 200 మందికిపైగా విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలు, ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆచార్య సురేష్‌బాబు, కేఎల్‌యూ ఇన్‌ఛార్జి వీసీ డాక్టర్ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయి..!

పాఠశాల పునఃప్రారంభం రోజే ఇచ్చేలా ప్రణాళిక ☛ మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, తుళ్లూరు, తాడికొండ, తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ గాడితప్పింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లు ముఖ్యంగా పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు వంటివి సకాలంలో అందక విద్యార్థులు ఎదురు చూడాల్సి వచ్చేది. దీనికి తోడు అవి నాణ్యతగా లేక పోవడంతో నెలలకే పాడైపోయాయి. దీంతో పిల్లలు అనేక రకాలుగా ఇబ్బంది పడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తుంది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కావాల్సిన పరికరాలు అందించడంలో మెరుగైన చర్యలు చేపట్టారు. 2025-26 విద్యా సంవత్సరం దృష్టిలో పెట్టుకుని ముందుగా పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి పిల్లలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఆయా మండల కేంద్రాలకు చేరాయి. ఉర్దూ మీడియం మినహా మిగిలిన తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, భౌతిక, రసాయన శాస్త్రం మొత్తం 5 రకాల సబ్జెక్టుల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కొద్ది రోజుల్లో సామగ్రి కూడా అందుబాటులోకి వస్తాయని విద్యా శాఖాధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం పిల్లలకు చదువు భారం కాకుండా ఉండేందుకు ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా పుస్తకాల మోత తగ్గించనుంది. తరగతులను బట్టి పుస్తకాల సంఖ్య తగ్గిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఊరటనిస్తుంది.

తాడేపల్లి చేరిన పుస్తకాలు

వివరాలిలా..

మండలం	మొత్తం ప్రభుత్వ బడులు	విద్యార్థులు	అందుబాటులోకి వచ్చినవి
మేడికొండూరు	53	4,439	13,874
ఫిరంగిపురం	56	4,500	13,200
తాడికొండ	47	3,980	15,656
తుళ్లూరు	53	3,084	10,011
మంగళగిరి	71	7,407	23,737
తాడేపల్లి	42	4,919	16,406
దుగ్గిరాల	54	3,769	12,434

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ..

మండల స్థాయిలో ఎంఈవో-2, ఎంఈవో-1 మండల ఇంజినీర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ సీఆర్పీఏ నుంచి మరో ముగ్గురు సభ్యులు కిట్లను మండల స్టాక్ పాయింట్‌కు చేర్చే బాధ్యత అప్పగించారు. వాటిని సరిచేసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేయడం, పాఠశాలలకు చేర్చడం, రోజు వారి నివేదికలను రూపొందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

అన్నీ సిద్ధం చేశాం..

వచ్చిన పాఠ్యపుస్తకాలను మండల స్థాయిలో స్టాక్ పాయింట్లకు తీసుకొచ్చాం. వచ్చిన పుస్తకాలను సరిచూసుకుంటున్నాం. మరో వారంలో కిట్లలో మిగిలినవి కూడా వస్తాయి. ప్రభుత్వ ఆదేశాలు మేరకు పాఠశాలలు తెరచిన రోజున విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో అన్ని ఏర్పాట్లు చేశాం. - **శాంతకుమారి, డిప్యూటీ డీఈవో, తాడేపల్లి**

వైద్య రంగం ప్రగతికి కృషి

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగం అభివృద్ధికి కృషి చేస్తుందని జిల్లా ఎన్‌సీడీసీడీ కోఆర్డినేటర్ గిరిధర్ తెలిపారు. ఫిరంగిపురంలో గల హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ శనివారం సందర్శించారు. ఫ్లోరైడ్ బాధితులకు మందులు పంపిణీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. గతంలో మూడో హెల్త్ అండ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

ప్రశ్నపత్రాలు వచ్చాయ్..:

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి వొకేషనల్ (వృత్తి విద్య) ప్రశ్నపత్రాలు శుక్రవారం అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు. పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి పరీక్షలు జరుగుతాయని, వీటికి 200 మంది విద్యార్థులు హాజరవుతారని అధికారులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తాడికొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. పొన్నెకల్లు గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. దామరపల్లి వెళ్లే ప్రధాన కల్వర్టుపై వంతెన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పాడి రైతులకు రాయితీపై పశువుల దాణా అందజేశారు. అనంతరం గుంటూరులోని తాడికొండ నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అధ్యక్షతన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి...పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సమతావాణి, మండల పశువైద్యాధికారి రాయప్పరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తలశిల ప్రసన్న కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గుంటుపల్లి మధు, భాజపా నాయకుడు బ్రహ్మయ్య, జనసేన నాయకుడు విజయ్ పాల్గొన్నారు.

రైతులకు దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, రాయప్పరెడ్డి

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో ఈ నెల 10వ తేదీ టిప్పర్ల బజారు, మన్యం వారి బజారు, మార్కండేయకాలనీ, నవులూరు పరిధిలోని గోలివారి తోట, మక్కివారిపేట, బాపనయ్యనగర్, టిడ్కో కాలనీలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్తు లైన్లకు మరమ్మతుల కారణంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు శుక్రవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

కలెక్టరేట్, న్యూస్‌టుడే: లైన్ల మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలతో పాటు, గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మేడికొండూరు, ఫిరంగిపురం మండలంలో శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉప కేంద్రంలో మరమ్మతు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. ఫిరంగిపురం మండలంలో అన్ని గ్రామాల్లో మేడికొండూరు, పేరేచర్ల, డోకిపర్రులో సరఫరా నిలిచిపోతుందన్నారు.

వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులను ఆదుకుంటాం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టరు బూర్ల రామాంజనేయులు అన్నారు. ఉపకరణాలు ఇచ్చేందుకు దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్తిపాడు బీవీఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో ఆ శాఖ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడారు. ఏపీలో ఇస్తున్నంత పింఛను దేశంలోని ఏ రాష్ట్రంలో ఇవ్వడం లేదని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయక సంచాలకులు సీహెచ్ సువార్త, పంచాయతీ కార్యదర్శులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు శివరామ ప్రసాద్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



దివ్యాంగుడి ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, కొర్రపాటి నాగేశ్వరరావు, తదితరులు

దారి..అధ్వానంగా మారి



మోరంపూడి నుంచి పేరకలపూడి వెళ్లే రోడ్డు అత్యంత దయనీయంగా మారింది. గుంతల్లో పడి వాహనం అదుపుతప్పితే కాలువలోకి దూసుకుపోయే ముప్పు ఉంది. దీనికితోడు ఎత్తు పల్లాలు ఉండడంతో రాత్రి వేళ తరుచూ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు తెచ్చుకోవాలన్నా చాలా కష్టంగా ఉందని రైతులు చెబుతున్నారు.

– న్యూస్‌టుడే, దుగ్గిరాల

ఆరిన తడి.. తప్పదు నీటి ఎద్దడి

పలు గ్రామాల్లో అడుగంటిన చెరువులు

పెదనందిపాడు, న్యూస్‌టుడే

ఫోకస్

పెదనందిపాడు, నాగులపాడు, వరగాని గ్రామాలకు తాగునీరు అందించే వరగాని సమీపంలోని సమగ్ర తాగునీటి పథకపు చెరువు ఎండిపోయింది. దీని పరిధిలో సుమారు 14,750 మంది జనాభా ఉన్నారు. నీటిఎద్దడి వచ్చే ప్రమాదం పొంచి ఉంది. 20 ఎకరాల చెరువులో కేవలం 20 శాతం నీరు మాత్రమే ఉంది. అధికారులు, నాయకులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. పథకం అందుబాటులో ఉన్నప్పటికీ బయటకు తాగునీరు టిన్నులు కొనుక్కోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కుళాయిల ద్వారా పెదనందిపాడు, నాగులపాడు, జరుగులవారిపాలెం, ఉప్పలపాడులలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు వాసన వస్తున్నాయి. క్రమం తప్పకుండా బ్లీచింగ్ చల్లిస్తే కొంత ఉపయోగం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగ డీఈ రమేష్ మాట్లాడుతూ ఈ నెల రెండో వారంలో మల్లాయిపాలెం మేజర్ కాలువకు నీరు సరఫరా చేస్తారని, వెంటనే చెరువు నింపుతామని, వడపోత బావుల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వరగానిలో ఎండిపోయిన సమగ్ర తాగు నీటి పథకం చెరువు

సంపులో నాచు పట్టి ఇలా..

దాహం కేకలు..?

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు గ్రామంలో మంచినీటి చెరువులో నీరు అడుగంటింది. దీంతో గ్రామంలో పంచాయతీ పైపులైను ద్వారా ప్రజలకు అందించే నీటిని ఒక పూటకు కుదించారు. దాన్నే స్థానికులు రోజంతా వాడుకోవాల్సి వస్తుంది. కొన్ని కుటుంబాలకు ఈ నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం వెలుపల పంట పొలాల మధ్యన ఉన్న పెద్దచెరువు కూడా ఎండిపోయింది. మేనెల 20వ తేదీకి పూర్తిగా ఎండిపోయే ప్రమాద ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాలపర్రు పాఠశాల వజ్రోత్సవం నేడు

షామియానాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పాలపర్రు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: పాలపర్రు శ్రీనారసింహప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం శనివారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆవరణను పూర్వవిద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దారు. అతిథులకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆహ్వాన సంఘం, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎం. మణికుమార్, ఎం. రమేష్‌బాబు తెలిపారు. ఉదయం కార్యక్రమానికి కలెక్టర్ ఎన్. నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్‌కుమార్, విశ్రాంత డీజీపీ మాలకొండయ్య, మాజీ మంత్రి డి. మాణిక్యవరప్రసాద్, సాయంత్రం 5.30 గంటలకు జరిగే కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, పుల్లారావు, శ్రావణ్‌కుమార్, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య హాజరవుతారని వారు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం 12న

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వరగాని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఈనెల 12న ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరంతో పాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు జెహోవాషామా హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు తెలిపారు. ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

యువత భవితకు నిచ్చెన

మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ చాటి కొలువులు సాధించారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తూ అండగా నిలుస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మేళాకు హాజరైన అభ్యర్థులు

ఎక్కువ కంపెనీలు అందుబాటులోకి తెచ్చారు. –డి.రమ్యసాయి. విజయవాడ

నేను బీటెక్ పూర్తి చేశాను. ఉద్యోగమేళాలో 48 కంపెనీలను అందుబాటులోకి తెచ్చారు. సొంతగా అన్ని చోట్లకు వెళ్లాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుంది. ఆ సమస్య లేకుండా ఇలాంటి మేళాలు దోహదపడతాయి. రూ.2 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికయ్యాను.

సౌకర్యాలు బాగున్నాయి. – జి.హేమ, గుంటూరు

బీటెక్ సీఎస్ఈ పూర్తి చేశాను. మేళాకు పలు రకాల కంపెనీల ప్రతినిధులు రావడంతో ఆసక్తి ఉన్న ఉద్యోగాన్ని పొందే అవకాశం కలిగింది. రూ.2 లక్షల వేతనంలో టెక్ మహేంద్ర సంస్థలో ఉద్యోగం పొందాను.

చాలా ఆనందంగా ఉంది. –టి.నాగవేణి, గుంటూరు

ఇంజినీరింగ్ పూర్తి చేశాను. 'టెక్ మహేంద్ర' సంస్థలో ఉద్యోగం లభించింది. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం అందుకోవడం ఆనందంగా ఉంది. ఇలాంటి ఉద్యోగ మేళాలు మరిన్ని ఏర్పాటు చేయాలి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం బేతపూడిలో శ్రీనివాసరావు(45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వెంకట్ తమ సిబ్బందితో శుక్రవారం రాత్రి ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. శ్రీనివాసరావు హత్యకు గురయ్యాడా? లేదా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ద్విచక్ర వాహనంతో ఢీకొట్టి.. రాయితో మోదినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తుంటే.. బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్..

తాడేపల్లి, న్యూస్‌టుడే: విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు. తాడేపల్లికి చెందిన కృష్ణ (44) అనే వ్యక్తి రహదారి దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ నెల 7వ తేదీ జరిగిన ఈ ఘటనలో గాయపడ్డ అతన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాము కాటుతో మహిళా కూలీ..

మేడికొండూరు, న్యూస్‌టుడే: పాము కాటుకు గురై చికిత్స పొందుతూ మహిళా కూలీ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన కృష్ణవెన్నెల(30) కుటుంబీకులు కొన్నాళ్ల కిందట పేరేచర్ల వలస వచ్చారు. గ్రామంలోని ఎన్ఆర్‌టీ రైల్వే గేటు సమీపంలో నివాసం ఉంటున్నారు. ఆమె కూలీ పని చేస్తుంటుంది. ఈనెల 7వ తేదీ గ్రామంలో పనికి వెళ్లింది. ఆ సమయంలో కాలిపై పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో గుంటూరు సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త కృష్ణ దర్జీగా పనిచేస్తున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి బీమా సాయం అందజేత

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి మండలం చినకాకానికి చెందిన తెదేపా కార్యకర్త కేశనం కోటేశ్వరరావు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తెదేపా సభ్యత్వం నుంచి లభించిన రూ.5 లక్షల బీమాను శుక్రవారం తెదేపా నాయకులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, కొంతమంది నాయకులు పాల్గొన్నారు. తెదేపా కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పెద్ద పీట వేస్తున్నారని శ్రీనివాసరావు అన్నారు. పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్ తోటా పార్ధసారథి, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి మంజూరు పత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

★ వడ్డేశ్వరంలో అనారోగ్యంతో బాధపడుతున్న సుగుణాకర్‌కు రూ. 68,916, శివకుమార్‌కు రూ. 59,003 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను గ్రామ తెదేపా నాయకులు కాట్రగడ్డ మధుసూధనరావు, స్థానిక నాయకులు అందజేశారు. టిడ్కో సముదాయంలో నివాసం ఉండే రెడ్డిలక్ష్మికి వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి నారా లోకేశ్ చొరవతో సీఎం సహాయనిధి రూ.1.50 లక్షలు మంజూరైంది. దీనికి సంబంధించిన పత్రాలను శుక్రవారం స్థానిక తెదేపా నాయకులు అందజేశారు.

'ఆ చట్టాలు ఉపసంహరించుకోవాలి'

మంగళగిరి, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఎం.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళగిరి మండలం ఎర్రబాలెంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యాన భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

జీతాలు చెల్లించండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: పెండింగ్ జీతాలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు మల్కాపురం జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

గోమాతలకు సీమంతం

పూజలు చేస్తున్న నాగభూషణం, శ్రీనివాసరావు

మంగళగిరి, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్య శిర్డీ సాయిబాబా మందిర గోమాత గోశాలలో గోవులకు శుక్రవారం సీమంత వేడుకలను నిర్వహించారు. భాజాపా రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం ఆధ్వర్యాన వేడుకలను నిర్వహించారు. గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు రాధిక దంపతులు పూజలు నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో గోమాతకు పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హిజ్రాలకు డీఎస్పీ కౌన్సెలింగ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో జరిగిన రెండు హత్యలకు సంబంధించి హిజ్రాలే కీలకంగా ఉన్న ఘటనలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు మంగళగిరిలోని డీఎస్పీ మురళీకృష్ణ హిజ్రాలకు శుక్రవారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈనెల 10వ తేదీ తహసీల్దార్ ఎదుట హిజ్రాలను బైండోవర్ చేయించనున్నట్లు తెలిపారు.

వైభవంగా లక్ష మల్లెల పూజ

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: నాగులపాడులోని శృంగేరి శారద పీఠ పాలిత వల్లి దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. తొలుత స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించారు.

పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల :స్వామివారు

శివాలయంలో ప్రత్యేక పూజలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక గంగాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయం(శివాలయం)లో వార్షిక ఉత్సవాలు శుక్రవారం మొదలయ్యాయి. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠాపనం నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈవో శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో అర్చకులు నాగేశ్వరం యుగంధర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10వ తేదీ రాత్రి వార్షిక కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

అమ్మకం వేలం ప్రకటన

గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, దొండపాడు గ్రామంలో ది: 15-5-25 గురువారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ రాజమల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామి వారికి చెందిన పాత ఇత్తడి ధ్వజం మానికలు అమ్మకం వేలం జరుగును. అలాగే సాయంత్రం 5 గంటలకు అనంతవరం గ్రామంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో శ్రీ స్వామి వారికి చెందిన పాత ఇత్తడి ధ్వజం మానికలు ఇంజనీరింగ్ వారి ఎస్టిమేషన్స్, దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం అమ్మకం వేలం జరుగును. కేజీ ఒక్క ఇంటికి చొప్పున వేలం నిర్వహించబడును పాటలో పాల్గొనేవారు ప్రథమ ధరావత్తుగా రూ.5000/- చెల్లించాలి పాట అనంతరం పాట మొత్తమును చెల్లించాలి. ఉన్నతాధికారుల అనుమతి తరువాత మానికలు అప్పగించబడును. ఇతర వివరములకు కార్యనిర్వాహణాధికారిని సంప్రదించగలరు.

ఇట్లు, శ్రీ స్వామివారి సేవలో కార్యనిర్వాహణాధికారి

(c) eenadu

గుంటూరు తూర్పు

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 14, వంగ 16, బెండ 20, పచ్చి మిర్చి 25, కాకర 34, క్యారెట్ 27, క్యాబేజీ 17, బీర 20, దొండ 18, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 18, గోరుచిక్కుళ్లు 30, దోస 18, పొట్ల 22, పెద్ద చిక్కుళ్లు 50, చామదుంప 44, మునగ 7, గోంగూర 8, తోటకూర 10, కొత్తిమీర 25, బీట్‌రూట్ 28, కీర 39, క్యాప్సికం 55, అల్లం 40, ఫ్రెంచి బీన్స్ 80, సొర 14, అరటి 7

-న్యూస్‌టుడే, పట్నంబజారు

ఘనంగా అమ్మవారి జయంతి మహోత్సవాలు

పూజలు అందుకుంటున్న అమ్మవారు

కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఏటుకూరురోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జరిగిన లక్ష మల్లెల పూజలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కొనకళ్ల సత్యం, కోట శేషగిరి, తల్లం శేఖర్, ఎన్.శివ పాల్గొన్నారు.

నగరంలో అనుమతి లేని బోర్డులు

నెహ్రూనగర్‌లో బోర్డు

నగరపాలకసంస్థ: తూర్పు నియోజకవర్గం మాజీ ప్రజాప్రతినిధికి చెందిన ఓ హెర్బల్ కంపెనీ ప్రకటనల కోసం నగరంలో విచ్చలవిడిగా ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ప్రకటనబోర్డులు వేసినా పట్టణ ప్రణాళిక అధికారులకు ఇవేం కనిపించవు. అనధికార బోర్డులు తొలగించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేస్తున్నా అవినీతికి అలవాటు పడిన కొందరు సిబ్బంది ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని అనధికార బోర్డులు తొలగించాల్సి ఉంది.

మురళీనాయక్‌కు నివాళి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన మురళీనాయక్ చిరస్మరణీయుడని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేటలోని కార్యాలయంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాఖ్య నాయకులు ప్రణీత్, అజయ్, వెంకట్, డేవిడ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం

జిల్లాపరిషత్తు: తల్లిదండ్రుల పట్ల చిన్న నాటి నుంచే ప్రేమ, గౌరవ భావం ఉండేలా చూసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టి.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం నగరంలోని వాసవీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనంలో భాగంగా బాలలతో పాటు కిశోరి బాలికలు తల్లుల పాదాలకు నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు తూర్పు సెక్టార్-1 సూపర్‌వైజర్ షేక్ రహిమూన్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పేద రోగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: పేద రోగులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు బియ్యం పంపిణీ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తెలిపారు. జీజీహెచ్‌లో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం, 13వ వారం 'మీకోసం మేము' కార్యక్రమంలో భాగంగా రోగులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ వేసవి కాలం రోగులతో పాటు వారి సహాయకులు తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు.

పోలీసు పోస్టులు ప్రకటనల కోసమేనా?

ఇన్నర్‌రింగురోడ్డులో పోస్టు

నగరపాలకసంస్థ: నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారుల్లో ఖాళీస్థలం దొరికితే చాలు ప్రకటన సంస్థల నిర్వాహకులు ఆక్రమించి పోలీస్‌లకు నీడ కోసమంటూ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై ప్రకటనలు వేసుకుని రూ.లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నారు. కానీ ఈ పోస్టులు ఎక్కడా ట్రాఫిక్‌కు పోలీసులకు ఉపయోగపడుతున్న పరిస్థితి లేదు. పట్టణ ప్రణాళికాధికారులు తమ ప్రయోజనం చూసుకొని వీటిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారు. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి నిరుపయోగంగా ఉన్న పోలీస్ పోస్టులను తొలగించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇక సత్వరం పౌర సేవలు

అందుబాటులోకి వచ్చిన జీఎంసీ మొబైల్ యాప్

మన జీఎంసీ మొబైల్ యాప్

నగరపాలకసంస (గుంటూరు), న్యూస్‌టుడే

పౌరసేవలు వేగంగా, నిర్దేశిత సమయం లోపు పారదర్శకంగా అందించేందుకు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నూతనంగా 'మన జీఎంసీ' పేరుతో మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.

ఈయాప్ ద్వారా పౌరసేవలన్నీ పొందడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆస్తి, నీటి, ఖాళీస్థలాల పన్నులు, వివిధ రకాల ఛార్జీలు చెల్లించేందుకు వీలవుతుంది. 'మన జీఎంసీ' యాప్‌ను మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు. యాప్‌తోపాటు ఎప్పటి నుంచో వినియోగంలో లేని జీఎంసీ వెబ్‌సైట్‌ను నవీకరించి.. వివరాలు నమోదు చేసి అందుబాటులో ఉంచారు. నగరపాలక సంస్థ అందిస్తున్న పౌరసేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతనంగా వెబ్‌సైట్, యాప్‌లను అధికారులు తెచ్చారు.

ఇలా వినియోగించుకోవాలి..

గూగుల్ ప్లే స్టోర్‌లో మన జీఎంసీ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో ఫోన్ నెంబర్ నమోదు చేసి వచ్చిన పిన్‌ను ఎంటర్ చేసి లోపలికి వెళ్లవచ్చు. తర్వాత వివరాలు నమోదు చేసి ఐడీ, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. అలా ఈ యాప్ ద్వారా ఫిర్యాదుల నమోదు, చెత్త, వ్యర్థాల సేకరణ, తరలింపు, తాగునీటి ట్యాంకర్ బుకింగ్ వంటి సేవలను సులువుగా పొందొచ్చు.

అధికారుల ఫోన్ నంబర్లు సైతం..

ఆయా డివిజన్ల వారీగా అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచారు. ప్రజారోగ్య విభాగం, పట్టణ పేదరిక నిర్మూలన(ఉపా సెల్), రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల అధికారుల నెంబర్లు ఉన్నాయి. ఆ విభాగం ఉన్నతాధికారి తర్వాత క్యాడర్‌ల వారీగా అధికారుల నెంబర్లు డివిజన్ స్థాయిలో వార్డు సచివాలయం సంబంధిత కార్యదర్శి పేరు, ఫోన్‌నెంబర్ల వివరాలు ఇచ్చారు.

నిర్ణీత సమయం మించిపోతే..

ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసినా నిర్దేశిత సమయంలోపుగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిర్ణీత సమయం మించిపోతే ఎందుకు చేయలేకపోయారో ప్రశ్నించేందుకు ప్రజలకు అవకాశం ఉంటుంది.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పట్నంబజారు, న్యూస్‌టుడే: తీగల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాతగుంటూరులోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డి-5 ఏఈ మస్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణస్వామిగుడి వీధి, బూరెలవారివీధి, యాదవుల బజారు, లక్ష్మీనగర్, బాలాజీనగర్‌లో 7వ లైను నుంచి 11వ లైను వరకు కరెంటు ఉండదని ఆయన వెల్లడించారు.

మజ్జిగ పంపిణీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: వేసవి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని తెదేపా జిల్లా కోశాధికారి కొనకళ్ల సత్యం అన్నారు. ఏటుకూరురోడ్డులోని అమ్మవారి దేవస్థానం వద్ద ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీను, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.1.60 కోట్లతో బీఆర్ స్టేడియం అభివృద్ధి

బీఆర్ స్టేడియంలో పరిస్థితులను కలెక్టర్ నాగలక్ష్మికి వివరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: బీఆర్ స్టేడియంలో రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ వెల్లడించారు. బీఆర్ స్టేడియంలో ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్టేడియంలో పరిస్థితులను కలెక్టర్ నాగలక్ష్మికి ఎమ్మెల్యే నసీర్ వివరించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 'బీఆర్ స్టేడియం 18 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ క్రీడా మైదానం నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా నిధులు, సీఎస్ఆర్, శాప్ ద్వారా సంయుక్తంగా డీపీఆర్ రూపొందించింది. పెండింగ్‌లో ఉన్న కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేస్తాం. స్టేడియం స్థలాన్ని పరిరక్షించుకునేందుకు ప్రహరీ నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో శాప్ ద్వారా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నిధులు తీసుకొచ్చి బీఆర్ స్టేడియాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతాం'.. అని వివరించారు.

ఉగ్రవాద చర్యలను ముస్లిం సమాజం సహించదు: ఎమ్మెల్యే నసీర్

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ముస్లిం సమాజం సహించబోదని. కేవలం మానవత్వమే మతమని ఖురాన్ గ్రంథం చెబుతుందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని ప్రపంచం యావత్తు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కశ్మీర్‌లో కాల్పులు కుల, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఉగ్రవాదులు చేసిన పిరికిపంద చర్యని వ్యాఖ్యానించారు. దేశరక్షణలో జవాన్ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోడవంపై బాధాకరమని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

'వచ్చే ఎన్నికల నాటికి వైకాపా ఖాళీ'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు భయపడి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తరిమికొట్టినా మారలేదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు పార్టీ మారకుండా కాపాడుకోవడం కోసం జగన్ పదేపదే అధికారులను బెదిరిస్తూ మైండ్‌గేమ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల నాటికి వైకాపా ఖాళీ అవుతుందన్నారు. వైకాపా హయాంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్, ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీలను అనేక రకాలుగా వేధించిన వ్యక్తి పీఎస్సార్ అన్నారు.

కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: విభాగాల వారీగా కోర్టు కేసుల పరిష్కారానికి ఈనెల 20వ తేదీ లోపు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసులే ఎక్కువ పెండింగ్ ఉన్నాయన్నారు. జీఎంసీ నుంచి తీసుకోవాల్సిన చర్యల్లో లోపం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 20 వరకు ప్రత్యేక డ్రైవ్ పెట్టుకుని కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు వంటివి పూర్తి చేయాలన్నారు. సోమవారం నుంచి రోజూ కేసుల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. కేసులకు సంబంధించి న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూపరింటెండెంట్లు, లీగల్ సెల్ సిబ్బంది సమన్వయంతో రోజూ కోర్టుకేసుల పురోగతిపై తమకు నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, డీసీలు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డీసీపీ సూరజ్‌కుమార్, మేనేజరు బాలాజీబాష తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లపై అభిప్రాయాలు తెలపండి

నగరపాలకసంస్థ: అన్నక్యాంటీన్లలో అందిస్తున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేయాలని కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయం వద్ద అన్నక్యాంటీన్‌ను పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి, సిబ్బందికి సూచనలు చేశారు.

దువ్వ పోసి.. సరిపెట్టేసి..

డస్టులో కూరుకుపోయిన లారీ

చిన్నెరుగుంట సెంటర్ నుంచి గాంధీనగర్‌కు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారింది. గుంతలమయంగా మారిన రోడ్డులో స్థానికులు డస్ట్ పోసి రాకపోకలు చేస్తున్నారు. శుక్రవారం లోడ్ లారీ ఇటుగా వెళుతూ డస్ట్ పోసిన ప్రాంతంలో కూరుకుపోయింది. ఈ ప్రాంతంలో దాదాపు మూడు వేలమందికి పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తమ ప్రాంతంలో రోడ్లను నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా..ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- పట్నంబజారు, న్యూస్‌టుడే

పేరుకుపోయిన చెత్త పోగులు

పాతగుంటూరులోని వెంకటయ్య రైస్ మిల్లు వద్ద వ్యర్థాలు

పాతగుంటూరులోని వెంకటయ్య రైస్ మిల్లు సెంటర్‌లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దాదాపు రెండు వారాల నుంచి కార్పొరేషన్ సిబ్బంది ఇక్కడి వ్యర్థాల్ని తొలగించడం లేదు. దీంతో వాటి నుంచి వచ్చే దుర్వాసన కారణంగా ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానికులు తెలిపారు. వ్యర్థాల వద్దకు ఆవులు, పందులు చేరి వాటిని రోడ్డుపైకి లాగేస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - పట్నంబజారు, న్యూస్‌టుడే

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని పీఎల్ రావు భవన్‌లో రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను హరించేలా నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి ఉన్న చట్టాలకు పాలకులు తూట్లు పొడుస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు పచ్చల శివాజీ, ఈమని అప్పారావు, మన్నవ హరిప్రసాద్, లక్ష్మీనారాయణ, హనుమంతురావు, అరుణకుమార్, లక్ష్మణరావు, వేణుగోపాలరావు, నాగమల్లేశ్వరరావు, రామకృష్ణ, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ అంజిబాబు, ఎస్సై లక్ష్మీనారాయణరెడ్డి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : రైలులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని శుక్రవారం గుంటూరు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో సీఐ అంజిబాబు నిందితుడి వివరాలు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగా నాయక్‌లు తమ రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేశారు. లాభం కోసం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించడానికి రైలులో తీసుకు వెళుతున్నారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐలు అంజిబాబు, శంకర్‌రావు, ఎస్సై లక్ష్మీనారాయణ రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సోమశేఖర్, వాసులు శుక్రవారం 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేశారు. అజిత్‌కుమార్ జైన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు భోగానాయక్ పరారీలో ఉన్నాడని, ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని సీఐ అంజిబాబు తెలిపారు.

మురుగు నీటి కష్టాలు తీరినట్లే..!

పట్టాభిపురం, న్యూస్‌టుడే

నవభారత్‌నగర్ ఒకటో లైనులో నిర్మిస్తున్న డ్రెయిన్

గత వైకాపా ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి పనులేవీ అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పలు ప్రాంతాల్లో చకచకా డ్రెయిన్లు, రహదారుల నిర్మాణ పనులు సాగుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీటితో ప్రజలు అయిదేళ్లుగా అష్టకష్టాలు పడ్డారు. ఇక వర్షం పడితే మురుగునీరు, వర్షపునీరు ఏకమై రహదారులను ముంచెత్తి రాకపోకలు ఏమాత్రం వీల్లేనంతగా తటాకాలను తలపించేవి. సైడుకాల్వల సామర్థ్యం పెంచి మురుగునీటి సమస్యల్ని పరిష్కరించాలని గత పాలకులకు ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కృష్ణనగర్ ప్రధాన రహదారి, నవభారత్‌నగర్ ఒకటో లైనులో డ్రెయినేజీ వ్యవస్థపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. మురుగునీరు రోడ్డును ముంచెత్తడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు.. సమస్యల్ని ప్రజాప్రతినిధులకు విన్నవించుకోవడంతో అధికారులతో చర్చలు జరిపి ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయించి టెండర్ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే కృష్ణనగర్ ప్రధాన రహదారితో పాటు నవభారత్‌నగర్ ఒకటో లైనులో డ్రెయిన్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రూ.1.56 కోట్లతో ముమ్మరంగా పనులు

కృష్ణనగర్ కుందుల రోడ్డు నుంచి ఉద్యానానికి వెళ్లే ప్రధాన రహదారిలో డ్రెయిన్ సామర్థ్యం పెంచుతున్నారు. ఈ ప్రాంతంలో కాలనీ ఏర్పడినప్పుడు ఉన్న సైడు కాల్వలు తప్ప తర్వాత ఎటువంటి పనులు జరగలేదు. అప్పటితో పోలిస్తే జనాభా ఎన్నో రెట్లు పెరిగింది. ఆ మేరకు డ్రెయిన్ల సామర్థ్యం పెంచకపోవడంతో మురుగునీటి పారుదల సక్రమంగా లేక దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడ్డారు. రూ.42 లక్షల వ్యయంతో డ్రెయిన్, కల్వర్టులు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

✦ మట్టికుప్పలు అక్కడే ఉంచి పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు. కొన్నిచోట్ల మంచినీటి పైపు లైన్లు దెబ్బతినడంతో ఆ పనులకు రూ.16 లక్షలు వెచ్చించారు. ✦ నవభారత్‌నగర్ ఒకటో లైనులో సైడు కాల్వలు సరిగా లేక మురుగునీరు రోడ్డు పైకి చేరుకోవడంతో అక్కడ వర్షా కాలం, వేసవి, శీతాకాలం అని తేడా లేకుండా మడుగును తలపించేది. ఇక్కడ రూ.49 లక్షల వ్యయంతో రెండు వైపులా డ్రెయిన్, మరో రూ.49 లక్షల వెచ్చించి రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు.

దిష్టిబొమ్మ దహనం అడ్డగింత

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీంను అడ్డుకుంటున్న పోలీసులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : సినీ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ దిష్టిబొమ్మ దహనానికి యత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూపై ఆమె సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకరంగా పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తూ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం హిందూ కళాశాల కూడలిలో శ్రష్టి దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిని అడ్డుకొని నగరంపాలెం పోలీసుస్టేషన్‌కు తరలించారు.

తూకాలపై అప్రమత్తత అవసరం

నాజ్‌సెంటర్‌లోని డీ మార్టులో సరకులు పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి

పట్నంబజారు, న్యూస్‌టుడే: వినియోగదారులు సరకులు కొనుగోలు చేసే సందర్భాల్లో తప్పుడు తూకాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి సూచించారు. ఈనెల 20న ప్రపంచ మెట్రాలజీ డే సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాజ్‌సెంటర్‌లోని డీమార్టులో తూకాలను పరిశీలించిన మాధురి మాట్లాడుతూ వినియోగదారులు సరకులు కొనుగోలు చేసేటప్పుడు విధిగా తయారీ తేదీ, ముగింపు తేదీ, ఎమ్మార్పీ, యూనిట్ సేల్ ప్రైజ్ తదితర వివరాలను పరిశీలించుకోవాలన్నారు. వినియోగదారులు మోసపోయినట్లు గుర్తిస్తే ట్రోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ శ్యాలేమ్‌రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ జి.కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, ఎస్టేట్ ఆఫీసర్లు ఫణి, గర్తపురి ఆర్గనైజేషన్ సభ్యుడు చదలవాడ హరిబాబు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందనకు వందనం

☛ సంగడిగుంట లాంచెస్టర్‌రోడ్డులో దుకాణాల వద్ద చెత్త కుప్పలు అలాగే వదిలేయడం వలన వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు సతీష్ 'మేమున్నాం..మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబుకు తెలియజేయడంతో చెత్త కుప్పలు తీయించి తరలింపజేశారు.

☛ చౌత్రా కూడలి ప్రాంతంలో సైడుకాల్వల్లో పూడికలు చేరి మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారిందని స్థానికులు అన్సారీ 'మేమున్నాం..మీకుతోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో కాల్వల్లో పూడికలు తీయించారు.

☛ షాబాహుస్సేన్‌నగర్ ఇళ్ల మధ్య ఖాళీస్థలాల్లో చెత్త, పిచ్చిమొక్కలు పెరిగి పక్కనున్న ఇళ్లలోకి పురుగులు, పాములు వస్తున్నాయని స్థానికులు మౌలాలి 'మేమున్నాం..మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్య ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో వార్డు సచివాలయం పర్యావరణ కార్యదర్శి యజమానులకు స్థలం శుభ్రం చేయించాలని నోటీసులు ఇచ్చారు.

-న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

ఎందరికో ఆదర్శం అన్నమయ్య

అన్నమాచార్య సంకీర్తన గానం చేస్తున్న శ్యాం కుమార్, తులసి బాయ్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు భాషా సాహిత్యానికి, సంగీతానికి, కవితా వికాసానికి తాళ్లపాక అన్నమాచార్యులు కృషి అనన్యసామాన్యమైనదని జిల్లా అటవీ శాఖ అధికారి హిమశైలజ అన్నారు. అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని భారతీయ విద్యా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన అన్నమయ్య కీర్తనలు రాష్ట్ర స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆమె ప్రసంగించారు. తెలుగునాట తొలి వాగ్గేయకారుడిగా 32,000 పైగా కీర్తనలు స్వరపరిచి, సాహిత్యాన్ని అందించి, తెలుగు భాషా వైభవానికి అన్నమయ్య విశేష కృషి చేశారన్నారు. భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్, ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బాలబాలికలకు, యువతకు అన్నమయ్య సంకీర్తనలపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ తెలుగు నాట అన్నమయ్య సంకీర్తనలు తెలియని వారు ఉండరన్నారు. వాగ్గేయకారులైన క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసులతో పాటు నేటి కాలంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ లాంటి వారికి అన్నమయ్య మార్గదర్శకుడన్నారు. ఈ సందర్భంగా తితిదే అన్నమయ్య ప్రాజెక్టు గాయకులు డాక్టర్ రాయదుర్గం శ్యాంకుమార్, తులసిబాయ్ అన్నమయ్య సంకీర్తనల కచేరీ చేశారు. కార్యక్రమంలో గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ప్రధాన కార్యదర్శి ఎంవై శేషరాణి, ఇన్‌టాక్ సభ్యుడు సీతారమేష్, భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపల్ హేమాంబ, ప్రధానోపాధ్యాయిని కృష్ణఉష్శ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్ నిర్మాణానికి నిధులివ్వండి

పట్టాభిపురం: బీసీ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సచివాలయంలో కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. మాధవి మాట్లాడుతూ 'ఎమ్మెల్యేగా విజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మిర్చియార్డు ఎదుట 2018లో 1.40 ఎకరాల విస్తీర్ణంలో బీసీ భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు అంచనాలతో శంకుస్థాపన చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించి నిర్మాణాన్ని అటకెక్కించింది. ప్రస్తుతం ఆ స్థలం నిరుపయోగంగా ఉంది. నిధులు మంజూరు చేసి బీసీ భవన్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు.

ఇన్‌ఛార్జి డీఎస్‌వోగా చంద్రముని బాధ్యతలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌ఛార్జి అధికారిగా స్టెప్ సీఈవో చంద్రముని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం నగర శాఖ అధ్యక్షుడు తుమ్మల గాంధీ, జిల్లా కార్యదర్శి టి.అంజయ్య, నగర కార్యదర్శి షేక్ జిలాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ బాబు తదితరులు ఇన్‌ఛార్జి డీఎస్‌వోకు పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

స్ఫూర్తిప్రదాత రాణాప్రతాప్‌సింగ్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాణాప్రతాప్‌సింగ్ స్ఫూర్తిప్రదాత అని పలువురు వక్తలు కీర్తించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో రాణాప్రతాప్‌సింగ్ జయంతిని శుక్రవారం రాత్రి నిర్వహించారు. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈసందర్భంగా పత్రి గాయత్రీదేవి భక్తి సంకీర్తన చేశారు. రామరాజు శ్రీనివాస్, వల్లూరు జయప్రకాశ్ నారాయణ, నూతలపాటి తిరుపతయ్య, డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి, షిండే లక్ష్మీనారాయణ, సంస్కార భారతి అధ్యక్షుడు ఇంద్ల శ్రీధర్‌బాబు ప్రసంగించారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

బీసీ భవన్ నిర్మాణానికి నిధులివ్వండి

చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేసి చర్చిస్తున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బీసీ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సచివాలయంలో కలిసి పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. మాధవి మాట్లాడుతూ 'ఎమ్మెల్యేగా విజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చిలకలూరిపేట రోడ్డులో మిర్చియార్డు ఎదుట 2018లో 1.40 ఎకరాల విస్తీర్ణంలో బీసీ భవన్ నిర్మాణానికి రూ.5 కోట్లు అంచనాలతో శంకుస్థాపన చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించి నిర్మాణాన్ని అటకెక్కించింది. ప్రస్తుతం ఆ స్థలం నిరుపయోగంగా ఉంది. నిధులు మంజూరు చేసి బీసీ భవన్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. తెదేపా సంస్థాగత ఎన్నికల్లో భాగంగా కొన్ని డివిజన్ పార్టీ కమిటీల్లో మార్పులు, చేర్పులు చేయాలి. రాబోయే నగరపాలక సంస్థ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెదేపాను మరింత బలోపేతం చేసేందుకు మార్పులు అత్యవసరం'.. అని సీఎం చంద్రబాబుకు విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. బీసీ భవన్ విషయంతో పాటు డివిజన్ పార్టీ కమిటీల్లో మార్పులు విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.

రూ.1.60 కోట్లతో బీఆర్ స్టేడియం అభివృద్ధి

బీఆర్ స్టేడియంలో పరిస్థితులు కలెక్టర్ నాగలక్ష్మికి వివరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: బీఆర్ స్టేడియంలో రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ వెల్లడించారు. బీఆర్ స్టేడియంలో ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్టేడియంలో పరిస్థితులను కలెక్టర్ నాగలక్ష్మికి ఎమ్మెల్యే నసీర్ వివరించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ 'బీఆర్ స్టేడియం 18 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ క్రీడా మైదానం నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు తయారయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా నిధులు, సీఎస్ఆర్, శాప్ ద్వారా సంయుక్తంగా డీపీఆర్ రూపొందించింది. పెండింగ్‌లో ఉన్న కాంప్లెక్సును అభివృద్ధి చేస్తాం. స్టేడియం స్థలాన్ని పరిరక్షించుకునేందుకు ప్రహరీ నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో శాప్ ద్వారా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నిధులు తీసుకొచ్చి బీఆర్ స్టేడియాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతాం' .. అని వివరించారు.

ఇక మురుగు నీటి కష్టాలు తీరినట్లే..!

నవభారత్‌నగర్ ఒకటో లైనులో నిర్మిస్తున్న డ్రెయిన్

మట్టి కుప్పలు తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

రెండు ప్రధాన రహదారుల్లో డ్రెయిన్ల అభివృద్ధి

గత వైకాపా ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి పనులేవీ అడుగు ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పలు ప్రాంతాల్లో చకచకా డ్రెయిన్లు, రహదారుల నిర్మాణ పనులు సాగుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీటితో ప్రజలు అయిదేళ్లుగా అష్టకష్టాలు పడ్డారు. ఇక వర్షం పడితే మురుగునీరు, వర్షపునీరు ఏకమై రహదారులను ముంచెత్తి రాకపోకలు ఏమాత్రం వీల్లేనంతగా తటాకాలను తలపించేవి. సైడుకాల్వల సామర్థ్యం పెంచి మురుగునీటి సమస్యల్ని పరిష్కరించాలని గత పాలకులకు ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కృష్ణనగర్ ప్రధాన రహదారి, నవభారత్‌నగర్ ఒకటో లైనులో డ్రెయినేజీ వ్యవస్థపై 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. మురుగునీరు రోడ్డును ముంచెత్తడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు.. సమస్యల్ని ప్రజాప్రతినిధులకు విన్నవించుకోవడంతో అధికారులతో చర్చలు జరిపి ప్రతిపాదనలు రూపొందించి నిధులు మంజూరు చేయించి టెండర్ ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే కృష్ణనగర్ ప్రధాన రహదారితో పాటు నవభారత్‌నగర్ ఒకటో లైనులో డ్రెయిన్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రూ.1.56 కోట్లతో ముమ్మరంగా పనులు

కృష్ణనగర్ కుందుల రోడ్డు నుంచి ఉద్యానానికి వెళ్లే ప్రధాన రహదారిలో డ్రెయిన్ సామర్థ్యం పెంచుతున్నారు. ఈ ప్రాంతంలో కాలనీ ఏర్పడినప్పుడు ఉన్న సైడు కాల్వలు తప్ప తర్వాత ఎటువంటి పనులు జరగలేదు. అప్పటితో పోలిస్తే జనాభా ఎన్నో రెట్లు పెరిగింది. ఆ మేరకు డ్రెయిన్ల సామర్థ్యం పెంచకపోవడంతో మురుగునీటి పారుదల సక్రమంగా లేక దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడ్డారు. రూ.42 లక్షల వ్యయంతో డ్రెయిన్, కల్వర్టులు నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

- మట్టికుప్పలు అక్కడే ఉంచి పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు. కొన్నిచోట్ల మంచినీటి పైపులైన్లు దెబ్బతినడంతో ఆ పనులకు రూ.16 లక్షలు వెచ్చించారు.
- నవభారత్‌నగర్ ఒకటో లైనులో సైడు కాల్వలు సరిగా లేక మురుగునీరు రోడ్డు పైకి చేరుకోవడంతో అక్కడ వర్షా కాలం, వేసవి, శీతా కాలం అని తేడా లేకుండా మడుగును తలపించేది. ఇక్కడ రూ.49 లక్షల వ్యయంతో రెండు వైపులా డ్రెయిన్, మరో రూ.49 లక్షల వెచ్చించి రహదారిని తారు రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు.

ధర వరలు



కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 14, వంగ 26, బెండ 24, పచ్చిమిర్చి 22, కాకర 38, బీర 42, క్యాబేజి 16, క్యారెట్ 27, దొండ 19, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 18, గోరుచిక్కుళ్లు 30, దోస 18, సొర 19, పొట్లకాయ 19, అరటికాయ 7, చామదుంప 42, మునగ 8, బీట్‌రూట్ 28, కీరదోసకాయ 39, బీన్స్ 79, క్యాప్సికమ్ 54, కొత్తిమీర 25, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 38, అల్లం 40, వెల్లుల్లి 90, చిలకడదుంప 36. -న్యూస్‌టుడే, పట్టాభిపురం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: లైన్ల మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాలతో పాటు, గుంటూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

'వచ్చే ఎన్నికల నాటికి వైకాపా ఖాళీ'

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు భయపడి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తరిమికొట్టినా మారలేదని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు పార్టీ మారకుండా కాపాడుకోవడం కోసం జగన్ పదేపదే అధికారులను బెదిరిస్తూ మైండ్‌గేమ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల నాటికి వైకాపా ఖాళీ అవుతుందన్నారు. వైకాపా హయాంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్, ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీలను అనేక రకాలుగా వేధించిన వ్యక్తి పీఎస్సార్ అన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోండి

మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ

నగరంపాలెం, న్యూస్‌టుడే: పేద రోగులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు బియ్యం పంపిణీ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తెలిపారు. జీజీహెచ్‌లో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం, 13వ వారం 'మీకోసం మేము' కార్యక్రమంలో భాగంగా రోగులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ వేసవి కాలం రోగులతో పాటు వారి సహాయకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆహార నియమావళి కార్యక్రమానికి సంబంధించి సహాయకులకు అవగాహన కల్పించారు. రోగుల సహాయకులు ఆసుపత్రి సిబ్బందికి సహకరించాలన్నారు.

ఇన్‌ఛార్జి డీఎస్‌వోగా చంద్రముని బాధ్యతలు

ఇన్‌ఛార్జి డీఎస్‌వో చంద్రమునికి పూలమొక్క అందజేస్తున్న రేషన్‌డీలర్ల సంఘం నగర అధ్యక్షుడు తుమ్మల గాంధీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌ఛార్జి అధికారిగా స్టెప్ సీఈవో చంద్రముని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంఘం నగర శాఖ అధ్యక్షుడు తుమ్మల గాంధీ, జిల్లా కార్యదర్శి టి.అంజయ్య, నగర కార్యదర్శి షేక్ జిలాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ బాబు తదితరులు ఇన్‌ఛార్జి డీఎస్‌వోకు పూలమొక్క అందించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

దీపాలు వెలగవు.. చీకట్లు వదలవు

నగరంలోని అరండల్‌పేట నాలుగో లైన్‌లో వీధి దీపాలు కొన్ని నెలల నుంచి వెలగడం లేదు. తెల్లవారుజామున వాకింగ్‌కి వెళ్లే మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళ వాహనదారులు చీకట్లో దారి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంతమంది ఆకతాయిలు అటుగా వెళ్లే మహిళలతో అసభ్యంగా మాట్లాడుతున్నారు. చీకట్లో వారిని గుర్తించడం కష్టమవుతుందన్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

97042 53525, 80085 74897

స్పందనకు వందనం

కాల్వల్లో పూడికతీత: నగరంపాలెం మస్తాన్‌దర్గా వెనుక వీధుల్లోని కాల్వల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాల్వల్లో పేరుకుపోయిన పూడిక తీయించి సమస్య పరిష్కరించారు.

చెత్త, వ్యర్థాల తొలగింపు: నల్లచెరువులోని ప్రధాన వీధుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలను తొలగించారు. -న్యూస్‌టుడే, నగరంపాలెం

కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

నగరపాలకసంస్థ: విభాగాల వారీగా కోర్టు కేసుల పరిష్కారానికి ఈనెల 20వ తేదీ లోపు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసులే ఎక్కువ పెండింగ్ ఉన్నాయన్నారు. జీఎంసీ నుంచి తీసుకోవాల్సిన చర్యల్లో లోపం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 20 వరకు ప్రత్యేక డ్రైవ్ పెట్టుకుని కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు వంటివి పూర్తి చేయాలన్నారు. సోమవారం నుంచి రోజూ కేసుల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. కేసులకు సంబంధించి న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, డీసీలు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డీసీపీ సూరజ్‌కుమార్, మేనేజరు బాలాజీబాష పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం

చిన్నారులను ఆశీర్వదిస్తున్న తల్లులు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: తల్లిదండ్రుల పట్ల చిన్న నాటి నుంచే ప్రేమ, గౌరవ భావం ఉండేలా చూసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టి.కృష్ణవేణి అన్నారు. శుక్రవారం నగరంలోని వాసవీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనంలో భాగంగా బాలలతో పాటు కిశోరి బాలికలు తల్లుల పాదాలకు నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు తూర్పు సెక్టార్-1 సూపర్‌వైజర్ షేక్ రహిమూన్, తల్లులు, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరం పౌర సేవలు

అందుబాటులోకి వచ్చిన జీఎంసీ మొబైల్ యాప్

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

మన జీఎంసీ మొబైల్ యాప్

పౌరసేవలు వేగంగా, నిర్దేశిత సమయం లోపు పారదర్శకంగా అందించేందుకు నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నూతనంగా 'మన జీఎంసీ' పేరుతో మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ఈయాప్ ద్వారా పౌరసేవలన్నీ పొందడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆస్తి, నీటి, ఖాళీస్థలాల పన్నులు, వివిధ రకాల ఛార్జీలు చెల్లించేందుకు వీలవుతుంది. 'మన జీఎంసీ' యాప్‌ను మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు. యాప్‌తోపాటు ఎప్పటి నుంచో వినియోగంలో లేని జీఎంసీ వెబ్‌సైట్‌ను నవీకరించి.. వివరాలు నమోదు చేసి అందుబాటులో ఉంచారు. నగరపాలక సంస్థ అందిస్తున్న పౌరసేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నూతనంగా వెబ్‌సైట్, యాప్‌లను అధికారులు తెచ్చారు.

ఇలా వినియోగించుకోవాలి..

గూగుల్ ప్లే స్టోర్‌లో మన జీఎంసీ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో ఫోన్ నెంబర్ నమోదు చేసి వచ్చిన పిన్‌ను ఎంటర్ చేసి లోపలికి వెళ్లవచ్చు. తర్వాత వివరాలు నమోదు చేసి ఐడీ, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. అలా ఈ యాప్ ద్వారా ఫిర్యాదుల నమోదు, చెత్త, వ్యర్థాల సేకరణ, తరలింపు, తాగునీటి ట్యాంకర్ బుకింగ్ వంటి సేవలను సులువుగా పొందొచ్చు.

అధికారుల ఫోన్ నంబర్లు సైతం..

ఆయా డివిజన్ల వారీగా అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచారు. ప్రజారోగ్య విభాగం, పట్టణ పేదరిక నిర్మూలన(ఉపా సెల్), రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ విభాగాల అధికారుల నెంబర్లు ఉన్నాయి. ఆ విభాగం ఉన్నతాధికారి తర్వాత క్యాడర్‌ల వారీగా అధికారుల నెంబర్లు డివిజన్ స్థాయిలో వార్డు సచివాలయం సంబంధిత కార్యదర్శి పేరు, ఫోన్‌నెంబర్ల వివరాలు ఇచ్చారు.

నిర్ణీత సమయం మించిపోతే..

ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు నమోదు చేసినా నిర్దేశిత సమయంలోపుగా పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిర్ణీత సమయం మించిపోతే ఎందుకు చేయలేకపోయారో ప్రశ్నించేందుకు ప్రజలకు అవకాశం ఉంటుంది.

రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి స్పష్టం చేశారు. 18వ డివిజన్‌లోని శ్రీనివాసరావుపేటలో పలు అభివృద్ధి పనులకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెదేపా సానుభూతిపరులు నివసించే ప్రాంతాల్లో అసలు అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాజకీయాలను పక్కన పెట్టి ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీనివాసరావుపేట నాలుగో లైనులో సిమెంటు రోడ్డు, డ్రెయిన్లు, పైపులైన్ల ఏర్పాటుకు రూ.24.50 లక్షలు వెచ్చిస్తున్నామన్నారు. వడ్డెగూడెంలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కార్పొరేషన్‌కు పంపుతామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల రమణ, తెదేపా నాయకులు ఉప్పుతల సాంబశివరావు, సానం రమేష్, అప్పిశెట్టి రంగా, జనసేన నాయకులు ఆళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

ఎందరికో ఆదర్శం అన్నమయ్య

అన్నమాచార్య సంకీర్తన గానం చేస్తున్న శ్యాం కుమార్, తులసి బాయ్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు భాషా సాహిత్యానికి, సంగీతానికి, కవితా వికాసానికి తాళ్లపాక అన్నమాచార్యులు కృషి అనన్యసామాన్యమైనదని జిల్లా అటవీ శాఖ అధికారి హిమశైలజ అన్నారు. అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని భారతీయ విద్యా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన అన్నమయ్య కీర్తనలు రాష్ట్ర స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆమె ప్రసంగించారు. తెలుగునాట తొలి వాగ్గేయకారుడిగా 32,000 పైగా కీర్తనలు స్వరపరిచి, సాహిత్యాన్ని అందించి, తెలుగు భాషా వైభవానికి అన్నమయ్య విశేష కృషి చేశారన్నారు. భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్, ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బాలబాలికలకు, యువతకు అన్నమయ్య సంకీర్తనలపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ తెలుగు నాట అన్నమయ్య సంకీర్తనలు తెలియనివారు ఉండరన్నారు. వాగ్గేయకారులైన క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసులతో పాటు నేటి కాలంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ లాంటి వారికి అన్నమయ్య మార్గదర్శకుడన్నారు. ఈ సందర్భంగా తితిదే అన్నమయ్య ప్రాజెక్టు గాయకులు డాక్టర్ రాయదుర్గం శ్యాంకుమార్, తులసిబాయ్ అన్నమయ్య సంకీర్తనల కచేరీ చేశారు. కార్యక్రమంలో గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ప్రధాన కార్యదర్శి ఎంవై శేషురాణి, ఇన్‌టాక్ సభ్యుడు సీతారమేష్, భారతీయ విద్యా భవన్ ప్రిన్సిపల్ హేమాంబ, ప్రధానోపాధ్యాయిని కృష్ణఉష్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత రాణాప్రతాప్‌సింగ్

ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాణాప్రతాప్‌సింగ్ స్ఫూర్తిప్రదాత అని పలువురు వక్తలు కీర్తించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో రాణాప్రతాప్‌సింగ్ జయంతిని శుక్రవారం రాత్రి నిర్వహించారు. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పత్రి గాయత్రీదేవి భక్తి సంకీర్తన చేశారు. సభాధ్యక్షుడిగా రామరాజు ఇన్‌ఫ్రా డెవలపర్స్ రామరాజు శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, నూతలపాటి తిరుపతయ్య, డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి, షిండే లక్ష్మీనారాయణ, సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు తదితరులు ప్రసంగించారు. ఇదే వేదికపై డాక్టర్ రాజపుత్ర మాధురీవిజేతసింగ్, బాణాల వెంకట సాయిమణికంఠ, రాజపుత్ర కార్తికలకు ప్రతిభా పురస్కారాలిచ్చి నిర్వాహకులు సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్షత్రి ధర్మనారాయణసింగ్, ఛత్రపతి శివాజీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జాజం సుబ్రహ్మణ్యం, బాణాల ఆంజనేయులు కార్యక్రమాలను నిర్వహించారు.

16 కిలోల గంజాయి స్వాధీనం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : రైలులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని శుక్రవారం గుంటూరు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో సీఐ అంజిబాబు నిందితుడి వివరాలు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అజిత్‌కుమార్ జైన్, భోగానాయక్‌లు తమ రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేశారు. లాభం కోసం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించడానికి రైలులో తీసుకు వెళుతున్నారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ అక్నేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐలు అంజిబాబు, శంకర్‌రావు, ఎస్సై లక్ష్మీనారాయణరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, సోమశేఖర్, వాసులు శుక్రవారం 1వ నంబర్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు చేశారు. అజిత్‌కుమార్ జైన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు భోగానాయక్ పరారీలో ఉన్నాడని, ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని సీఐ అంజిబాబు తెలిపారు.

ఉగ్రవాద చర్యలను ముస్లిం సమాజం సహించదు

నగరపాలకసంస్థ: ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ముస్లిం సమాజం సహించబోదని.. కేవలం మానవత్వమే మతమని ఖురాన్ గ్రంథం చెబుతుందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని ప్రపంచం యావత్తు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కశ్మీర్‌లో కాల్పులు కుల, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఉగ్రవాదులు చేసిన పిరికిపంద చర్యని వ్యాఖ్యానించారు. దేశ రక్షణలో జవాన్ మురళీనాయక్ ప్రాణాలు కోల్పోడవంపై బాధాకరమని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అన్న క్యాంటీన్లపై అభిప్రాయాలు తెలపండి

నగరపాలకసంస్థ: అన్నక్యాంటీన్లలో అందిస్తున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేయాలని కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆర్టీవో కార్యాలయం వద్ద అన్నక్యాంటీన్‌ను పరిశీలించి ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి, సిబ్బందికి సూచనలు చేశారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని పీఎల్‌రావు భవన్‌లో రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచుమాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను హరించేలా నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి ఉన్న చట్టాలకు పాలకులు తూట్లు పొడుస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు పచ్చల శివాజీ, ఈమని అప్పారావు, మన్నవ హరిప్రసాద్, లక్ష్మీనారాయణ, హనుమంతురావు, అరుణకుమార్, లక్ష్మణరావు, వేణుగోపాలరావు, నాగమల్లేశ్వరరావు, రామకృష్ణ, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: తోపుడు బండిపై ఐస్‌క్రీమ్ విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారిపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. శారదాకాలనీలో హీరాలాల్ ఐస్‌క్రీమ్ అమ్ముకుంటుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుంజి గోపి దాడి చేసి రూ.2,000 నగదు లాక్కుని పరారయ్యాడు. ఈ కేసులో నిందితుడైన గోపిని పోలీసులు అరెస్టు చేశారు.

తూకాలపై అప్రమత్తత అవసరం

పట్నంబజారు, న్యూస్‌టుడే: వినియోగదారులు సరకులు కొనుగోలు చేసే సందర్భాల్లో తప్పుడు తూకాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ మాధురి సూచించారు. ఈనెల 20న ప్రపంచ మెట్రాలజీ డే సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాజ్‌సెంటర్‌లోని డీమార్టులో తూకాలను పరిశీలించిన మాధురి మాట్లాడుతూ వినియోగదారులు సరకులు కొనుగోలు చేసేటప్పుడు విధిగా తయారీ తేదీ, ముగింపు తేదీ, ఎమ్మార్పీ, యూనిట్ సేల్ ప్రైజ్ తదితర వివరాలను పరిశీలించుకోవాలన్నారు. వినియోగదారులు మోసపోయినట్లు గుర్తిస్తే ట్రోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ శ్యామ్‌రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ జి.కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు, ఎస్టేట్ ఆఫీసర్లు ఫణి, గర్తపురి ఆర్గనైజేషన్ సభ్యుడు చదలవాడ హరిబాబు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పాఠాలు నేర్వరా..

సాకేతపురంలో మురుగులో కలిసి పోయిన తాగునీటి పైపులు

కొరిటెపాడులో మురుగులో పైపులు లీకేజీ

అశోక్‌నగర్‌లో వ్యర్థాలు మురుగులో కలిసి

నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్లు మురుగు కాలువల్లో కలిసిపోయి తాగునీరు కలుషితమవుతోంది. ఇప్పటికే సాకేతపురం, కొరిటెపాడు, ఆంజనేయపేట ప్రాంతాల్లో తాగునీరు మురుగు వాసన వస్తోందని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. గతేడాది శారదాకాలనీలో డయేరియా వ్యాపించి నలుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారు. దీంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నగరంలో మురుగు కాలువల్లో ఉన్న పైపులు తొలగిస్తామని నగరపాలక సంస్థ అధికారులు పేర్కొన్నారు. అధికారులు కొన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టి.. కొద్ది రోజులు హడావుడి చేసినా.. తర్వాత పట్టించుకోలేదు. ఎండాకాలం వచ్చిన నేపథ్యంలో మళ్లీ అటువంటి పరిస్థితి తలెత్తకుండా తాగునీటి పైపులు మురుగు కాలువల్లో లేకుండా చూడాలని, అలా ఉన్నవాటిని గుర్తించి తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు. - ఈనాడు గుంటూరు

(c) eenadu